**నేటి కందం-నేటికి అందం**

కను బ్రిక్స్ ఎమ్మెస్మృమ్మీ
తన సామర్థ్యమును జూప తగు విధముగ నూ
తన ఆవిష్కరణలతో
మన ఆగ్రా నగరమున సమావేశ మిడెన్ !!
(భారత దేశం ఆతిథ్యం యివ్వగా బ్రిక్స్ దేశాల ఎమ్మెస్మృమ్మీ వ్యవస్థ మన ఆగ్రా నగరంలో తొలిసారిగా తన నూతన ఆవిష్కరణలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఇది ఎమ్మెస్మృమ్మీ రంగంలో భారత దేశ ప్రతిష్ఠను ఇనుమడింప చేసింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**చురక**

అధినేతలు ఉన్మాదులు
అయిపోతే యుద్ధం
కూల్చివేయ ప్రపంచాన్ని
కాచుకుంద్రు సిద్ధ
అంతా ధ్వంసమైనంకా
అంటుంటరు శాంతి
ఒప్పందం శాశ్వతంగా
ఒనగూడుదు భ్రాంతి



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 20-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:244 పేజీలు:6 వెల: రూ.1/-


## వనరుల సమీకరణపై భట్టి విక్రమార్క సమీక్ష

### -అభివృద్ధికి ఆర్థిక బలం

**-ఆదాయ పెంపు, సంక్షేమ పథకాల నిధుల సమీకరణపై కేబినెట్ సబ్ కమిటీ కీలక సమావేశం**

**-రిజిస్ట్రేషన్ విలువలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై విస్తృత చర్చ**



హైదరాబాద్, జూన్ 19: రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణ, ప్రభుత్వ ఆదాయ పెంపు, సంక్షేమ పథకాల అమలుకు నిధుల సమకూర్పు అంశాలపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన తెలంగాణ సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ కీలక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, పారిశ్రామికాభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణపై సమగ్రంగా చర్చించారు.

**ఆదాయ వనరుల పెంపుపై దృష్టి**

సమావేశంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచే మార్గాలపై ప్రధానంగా చర్చ జరిగింది. ముఖ్యంగా భూముల రిజిస్ట్రేషన్ విలువలు, మార్కెట్ ధరల సవరణ ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే అవకాశాలను అధికారులు వివరించారు. భూవిలువల ప్రస్తుత పరిస్థితులు, మార్కెట్ ధోరణులపై సమగ్ర నివేదికలను పరిశీలించిన కమిటీ, ఆదాయ వృద్ధికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించింది.

**సంక్షేమ పథకాలకు నిధుల సమకూర్పు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ గృహ నిర్మాణం, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళా సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణ అంశం సమావేశంలో ప్రాధాన్యంగా నిలిచింది. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఆర్థిక వనరులు అందుబాటులో ఉంచే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాల కల్పన, పారిశ్రామిక వృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు. కొత్త పారిశ్రామిక విధానం, హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) కార్యక్రమం అమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణపై అధికారులు ప్రజెంటేషన్లు ఇచ్చారు.

మహిళా, శిశు సంక్షేమ శాఖతో పాటు పలు ప్రభుత్వ శాఖలు సమర్పించిన నివేదికలను కేబినెట్ సబ్ కమిటీ పరిశీలించింది.

బడ్జెట్ కేటాయింపులు, వ్యయ ప్రణాళికలు, ఆదాయ వనరులు, భవిష్యత్ ఆర్థిక అవసరాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.

## తెలంగాణలో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు





హైదరాబాద్, జూన్ 19: తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభి.వృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరో వర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది.

**రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు కృతజ్ఞతలు: సీఎం రేవంత్**

మూసీ రిఫర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్రం అనుమతి ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సీఎం కృతజ్ఞతలు తెలియజేశారు.

మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదు.. సేఫ్ ఎన్విరాన్మెంట్ ముఖ్యం: సీపీ సజ్జనార్

హైదరాబాద్, జూన్ 19: మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు క్షమించమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం) హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'స్కూల్ పిల్లల భద్రత'పై స్కూల్ యాజమాన్యాలు, సంబంధిత శాఖలతో ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిటీ పరిధిలో 3500లకు పైగా స్కూల్స్ ఉన్నాయని, వీటిలో 12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు.

విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్విరాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్‌మ్యాప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు.

## ఇరాన్ నౌకలకు లైన్ క్లియర్.. ఆంక్షలు ఎత్తివేసిన యూఎస్

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంతో హార్ముజ్ జలసంధి లో ఇరాన్ నౌకలకు లైన్ క్లియర్ అయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్ ఓడరేవుల వద్ద విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేసినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఇరాన్ షరతులకు అంగీకరించడంతో ఎత్తివేసినట్లు ఈ మేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది.

దీంతో అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలు పునఃప్రా రంభమయ్యాయి. అయితే ఒప్పందం అమలును పర్యవేక్షించడానికి అమెరికా యుద్ధనౌకలు ఆ ప్రాంతంలో ఉంటాయని ఇరాన్ నౌకలకు ఎలాంటి ఆటంకం కలిగించవని సెంటకామ్ పేర్కొంది. హార్మ్యూజ్‌లో నౌకల రాకపోకలకు లైన్ క్లియర్ అవడంతో 12.5 మిలియన్ బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని వైట్ హౌస్ మీడియా సమావేశంలో ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ తెలిపారు.

అలాగే ఈ జలసంధి గుండా వెళ్లాలనుకునే నౌకలకు త్వరితగతిన అనుమతులు లభించేలా చూస్తామని, అయుద్ధ సమయంలో జలమార్గంలో అమర్చిన మందుపాతరలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం తర్వాత ఇరాన్ అమెరికాకు గట్టి వార్నింగ్ ఇచ్చింది. అమెరికా నిబంధనలు ఉల్లంఘించినా లేనిపోని ఆంక్షలు విధించినా తమ స్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ హెచ్చరించారు.

## సింగరేణిపై బీజేపీ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

### -ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్



హైదరాబాద్, జూన్ 19: సింగరేణిపై బీజేపీ ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలి ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. సింగరేణి సంస్థపై మాట్లాడే నైతిక అర్హత గానీ, అక్కడ పర్యటించే హక్కు గానీ బీజేపీకి ఎంతమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న బీజేపీ నాయకులు.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని సింగరేణికి వెళ్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ చర్యల ద్వారా బీజేపీ ఎంతటి దౌర్భాగ్య స్థితిలో ఉందో స్పష్టంగా అర్థమవుతోందని ఎద్దేవా చేశారు.

సింగరేణి సంస్థను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కుట్రలు పన్నుతున్నాయని అద్దంకి దయాకర్ ఆరోపించారు. పైకి మాత్రం వేర్వేరుగా నటిస్తున్నప్పటికీ.. ఈ రెండు పార్టీలు రాజకీయ మిత్రులని విమర్శించారు. సింగరేణిని చుట్టుముట్టి ఇరు పార్టీలు చేస్తున్నవి కేవలం రాజకీయాలేనని మండిపడ్డారు. దేశంలో బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తున్న విధానంపై, సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై కిషన్ రెడ్డి తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న బీజేపీకి, బొగ్గు నిల్వలపై మాట్లాడే అర్హత ఎక్కడిదని నిలదీశారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ ముప్పు నుంచి కాపాడింది, నిరంతరం ఆదుకుంటున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

## మిమిక్రీ కళను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు నేరెళ్ల వేణుమాధవ్ : అంపశయ్య నవీన్



హనుమకొండ, జూన్ 19: మిమిక్రీ కళను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ అని కేంద్ర పురస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, రచయిత అంపశయ్య నవీన్ అన్నారు. శుక్రవారం నేరెళ్ల వేణుమాధవ్ 8వ వర్ధంతి కార్యక్రమాన్ని హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించారు.

ఈ సందర్భంగా నేరెళ్ల విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. నేరెళ్ల వేణుమాధవ్ ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దారన్నారు. మిమిక్రీ కళకు హోదా కల్పించి, ఉపాధి కల్పించారన్నారు.

మిమిక్రి సిలబస్ని తయారు చేసిన ఆయన డిప్లొమా కోర్స్?ని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశ పెట్టి.. ఎందరో నిరుద్యోగులకి ఉపాధి కల్పిస్తున్న మహోన్నత వ్యక్తి డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్‌ని కొనియాడారు. ఆయన లేకపోవడం మిమిక్రీ కళకు తీరని లోటన్నారు. నేరెళ్ల వేణుమాధవ్ ట్రస్ట్ అధ్యక్షురాలు నేరెళ్ల శోభావతి మాట్లా డుతూ..అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని తనంతో పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో అభివృద్ధికి దూరంగా ఉంటుందని, రంగులు వేయడంలేదన్నారు.

రూంలో నీళ్లు రాకపోవడంతో కార్యక్ర మాలు నిర్వహించే కళాకారులు ఇబ్బందులు తప్పడంలేదని ఈ విషయంపై అందరం కలిసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేయాలని సూచించారు.నవంబర్ 14లోగా మరమ్మతులు చేయించి నూతనంగా తీర్చిదిద్దాలని ఆమె కోరారు. అలాగే పిల్లల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాటక పోటీలు నిర్వహించాలని ఇందులో గెలుపొంది నవారికి మొదటి ప్రైజ్ కింద రూ.పది వేలు, రెండో బహుమతి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు శోభావతి తెలిపారు.

కవులు రామా చంద్రమౌళి, పొట్లపల్లి శ్రీనివాస్రావు, వరిగొండ కాంతారావు, గిరిజా మనోహర్, వనం లక్ష్మీకాం తారావు, తోట పూర్ణచందర్, నేరెళ్ల వేణుమాధవ్ కుమారుడు నేరెళ్ల రాధాకృష్ణ, కోడలు శ్రీలత, నేరెళ్ల శ్రీనాథ్, మ్యాజిక్ వెంకటరమణ, మ్యాజిక్ రాజశేఖర్, సింగర్ మధు, నల్ల శ్రీనివాస్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మిమిక్రీ కళాకారులు అంజన్‌కుమార్, బాబర్, కిరణ్‌కుమార్, దామోదర్, ముజ్జిక సదాశివరావు, బాబా పాల్గొని సినీరంగంలోని ప్రముఖ హీరోలతో పాటు, రాజకీయ నేతలు, వివిధ పక్షుల గళాలను వినిపించి ఆతులను ఎంతగానో ఆకట్టుకున్నారు.

## సీఎం విజయ్‌కు ఊరట.. బలపరీక్షపై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం కోర్టు

తమిళనాడు జూన్ 19: తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఊరట దక్కింది. అసెంబ్లీలో సీఎం విజయ్ బలపరీక్షపై సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పిటిషన్‌లో పేర్కొన్నవి అస్పష్టమైన ఆరోపణలు మాత్రమేనని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఆరోపణలకు బలం చేకూర్చే ఆధారాలు లేవని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది.మే 13న అసెంబ్లీ వేదికగా జరిగిన బలపరీక్షలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన తన సంఖ్యాబలాన్ని సీఎం విజయ్ నిరూపించుకున్నారు. వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎమ్ఎల్ పార్టీలు టీవీకే అధినేత విజయ్‌కు మద్దతు పలికాయి. 25 మంది అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు కూడా టీవీకే అధినేత విజయ్‌కు అండగా నిలిచారు. డీఎంకే మాత్రం వాకౌట్ చేసింది. ఈ క్రమంలో సీఎంకు సభలో మద్దతు తెలిపిన ఎమ్మెల్యేల సంఖ్య 120కు చేరింది. మేజిక్ ఫిగర్‌కు అదనంగా ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతును సీఎం సాధించారు. అయితే, బలపరీక్షలో అక్రమాలు జరిగాయని ఈ సందర్భంగా ప్రతిపక్షం ఆరోపించింది.

## కృష్ణా జిల్లాలో విషాదం..

అమరావతి, జూన్ 19: కృష్ణా జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. బిర్యాని కోసం వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఉయ్యూరు మండలం తోమతోటి గ్రామానికి చెందిన అర్జునరావు(30) ప్రొక్లెన్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. బిర్యాని తీసుకొస్తానని ఇంట్లో చెప్పి అర్జునరావు బైక్‌పై ఉయ్యూరు వెళ్లారు.

తిరిగి వస్తుండగా ఉయ్యూరు-తేలప్రోలు రహదారిలో కాటూరు వద్దకు రాగానే కారు, బైక్ ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో అర్జునరావు అక్కడికక్కడే మృతి చెందారు.

## దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి.. 16 మంది మృతి.. పలువురికి గాయాలు



న్యూఢిల్లీ, జూన్ 19: లెబనాన్‌లోని హిజ్‌బుల్లాను టార్గెట్ చేస్తూ శుక్రవారం ఇజ్రాయెల్ రక్షణ దళాలు అటాక్ చేశాయి. ఆ దాడుల్లో సుమారు 16 మంది మృతిచెందారు. అనేక మంది గాయపడినట్లు స్థానిక మీడియా పేర్కొన్నది. ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఉండాలని అమెరికా-ఇరాన్ ఒప్పందంలో ఉన్నా.. లెబనాన్‌పై మాత్రం దాడులు ఆగలేదు. ఐడీఎఫ్ ఇవాళ ఆ దాడులకు సంబంధించిన ప్రకటన చేసింది. దక్షిణ లెబనాన్‌లో రాత్రిపూట దాడులు చేసినట్లు ఐడీఎఫ్ చెప్పింది. హిజ్‌బుల్లా ఏకధాటిగా కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడుతోందని, దీనిలో భాగంగానే ప్రతిదాడి చేశామని ఐడీఎఫ్ తెలిపింది.

మరో వైపు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన చర్చలను వాయిదా చేశారు. ఈ విషయాన్ని స్విస్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ ఆ చర్చలను నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు స్విస్ విదేశాంగ మంత్రిత్వశాఖ పేర్కొన్నది. అమెరికా, ఇరాన్, ఖతార్, పాక్ మధ్య జరగాల్సిన ప్రతిపాద చర్చలు వాయిదా పడ్డాయని ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరగాల్సిన చర్చల్లో పాల్గొనేందుకు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెళ్లడం లేదని శ్వేతసౌధ ప్రతినిధి వెల్లడించారు.

# ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చిన వై-ఫై సాంకేతిక పరిజ్ఞానం !

## (జూన్ 20న "ప్రపంచ వై-ఫై దినోత్సవం" సందర్భంగా)

ప్రతి సంవత్సరం జూన్ 20న జరుపుకునే "ప్రపంచ వై-ఫై దినోత్సవం(వరల్డ్ వై-ఫై డే), "కనెక్టెడ్ కమ్యూనిటీస్ ఫోరమ్" నాయకత్వంలో "వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ అలయన్స్" నిర్వహించే ఒక ప్రత్యేకమైన ప్రపంచవ్యాప్త కార్యక్రమం. "వై-ఫై" అనేది "వైర్‌లెస్ ఫిడిలిటీ"కి సంక్షిప్త రూపంగా విస్తృతంగా బోధించబడుతూ ఆమోదించబడింది. ఈ రోజున మన దైనందిన జీవితాలకు వై-ఫై అందించే గొప్ప సహకారాన్ని, ఆవిష్కరణను, ఇంటర్నెట్ సదుపాయం లేని వారిని అనుసంధానించాలనే లక్ష్యాన్ని మనం తీసుకుంటున్నాం. నేటికీ ప్రపంచవ్యాప్తంగా 4 బిలియన్లకు పైగా ప్రజలకు ఇంటర్నెట్ సదుపాయం లేదు. ఇంటర్నెట్ సదుపాయం అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలకు వృద్ధిని అందిస్తుంది, వారి సామాజిక చలనశీలతను, కంప్యూటర్ అక్షరాస్యతను మెరుగుపరుస్తుంది, అలాగే వారి విద్యా అవకాశాలను సుసంపన్నం చేస్తుంది. ఈ దినోత్సవం 1997లో ప్రారంభమై ప్రతి ఏటా మరింత ఉత్సాహంతో కొనసాగుతున్నది.

### అనుసంధానం లేని వారిని అనుసంధానిద్దాం:

ప్రపంచ వై-ఫై దినోత్సవం, డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో వైర్‌లెస్ టెక్నాలజీ పోషించిన పరివర్తనాత్మక పాత్రను వేడుకగా జరుపుకుంటుంది. అలాగే, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో "అనుసంధానం లేని వారిని అనుసంధానించే" నిరంతర కార్యాన్ని ఇది ప్రముఖంగా చాటి చెబుతుంది. ఇంటర్నెట్ సదుపాయాన్ని అందుబాటు ధరలో, సుస్థిరంగా అందించే ప్రయత్నాలను ఇది హైలైట్ చేస్తుంది. తద్వారా, అణగారిన వర్గాలకు విద్య, పరిశోధన, టెలి-హెల్త్, ఆర్థిక అవకాశాలను కల్పిస్తుంది. 1977 నాటి తొలి 2 ఓఎజూబ నెట్‌వర్క్‌ల నుండి నేటి ఆధునిక గిగాబిట్-స్పీడ్ వై-ఫై 6, వై-ఫై 7 టెక్నాలజీల వరకు వేగవంతమైన పురోగతిని ఈ రోజు గుర్తిస్తుంది. ఇటీవల ప్రారంభించిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ యొక్క "పరివర్తన కోసం ఆవిష్కరణలు" (ఎనినినీలజీబివ బినీ ఁతీజీనిబటనీతీఎ) అనే థీమ్‌కు అనుగుణంగా, ఈ సంవత్సరం ప్రపంచ వై-ఫై దినోత్సవ వేడుకలను "భారతదేశాన్ని పరివర్తన చెందిస్తూ, ప్రపంచం కోసం ఆవిష్కరిస్తూ" (ఁతీజీనిబటనీతీఎతినిణ ఎనిటతిజీ, ఎనినినీలజీబితినిణ టనీతీ బిష్త్రవ చినీతీశ్రీట) అనే థీమ్‌తో జరుపుకుంటున్నారు.

### ప్రధానమంత్రి వై-ఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్, PM-WANI:

ప్రపంచ కనెక్టివిటీపై వై-ఫై యొక్క ప్రగాఢ ప్రభావాన్ని, అలాగే ఆర్థిక వృద్ధి, సామాజిక చైతన్యం, విద్య, డిజిటల్ సమ్మిళితాన్ని నడిపించడంలో దాని కీలక పాత్రను ఈ రోజు నొక్కి చెబుతోంది.

భారతదేశంలో, ఖఒ-చింఔఎ (ప్రధాన మంత్రి వై-ఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్) వంటి కార్యక్రమాలు, అందరికీ డిజిటల్ సమ్మిళితం అనే లక్ష్యానికి మద్దతునిస్తూ, పబ్లిక్ హాట్‌స్పాట్‌లను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. భారతదేశంలో 90 శాతానికి పైగా బ్రాడ్‌బ్యాండ్ వినియోగం వై-ఫై నెట్‌వర్క్‌ల ద్వారానే జరుగుతున్నందున, ఇటీవల 6 ఉ ఊళి బ్యాండ్‌ను డీలైసెన్సింగ్ చేయడం అనేది తదుపరి తరం వై-ఫై (6ఇ మరియు ఆపైన) యొక్క కొత్త శకాన్ని ఆవిష్కరిస్తుందని భావిస్తున్నారు. ఇది వేగవంతమైన, మరింత విశ్వసనీయమైన హోమ్ వై-ఫైకి, భవనాలలో మెరుగైన డిజిటల్ కనెక్టివిటీ కవరేజీకి, స్మార్ట్ సిటీలు, స్మార్ట్ ఫ్యాక్టరీల వంటి పరిశ్రమలలో ప్రైవేట్ నెట్‌వర్క్‌ల రంగంలో ఆవిష్కరణలకు అవకాశాలకు దారితీస్తుంది. 2030 నాటికి 5 కోట్ల పబ్లిక్ వై-ఫై హాట్‌స్పాట్‌లను సాధించాలనేది లక్ష్యం. 2015లో కోల్‌కతా భారతదేశపు మొట్టమొదటి వై-ఫై సౌకర్యం గల మెట్రో నగరంగా గుర్తింపు పొందింది. అయితే, వాణిజ్యపరమైన పూర్తి వైర్‌లెస్ పబ్లిక్ యాక్సెస్ విషయంలో, వారసత్వ నగరమైన మైసూరు 2005లోనే ఈ ఘనతను సాధించింది. జనవరి 2017లో, ప్రభుత్వ నిధులతో 500 పబ్లిక్ వై-ఫై హాట్‌స్పాట్‌లతో కూడిన భారీ నెట్‌వర్క్‌ను ప్రారంభించిన మొట్టమొదటి భారతీయ నగరం ముంబై నిలిచింది.

ఇంటర్నెట్ ఎప్పటినుంచో మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిపోయింది. ఆఫీసులో ఆన్‌లైన్ పరిశోధన, వీడియో సమావేశాల నుండి వ్యక్తిగత సంభాషణలు, వినోదం వరకు - మన జీవితంలోని ఎన్నో రంగాలు ఆన్‌లైన్‌లో భాగమవుతున్నాయి. వై-ఫై (చితి-ఈతి) పుణ్యమా అని, చాలా ఆధునిక క్లయింట్ పరికరాలతో ఇదంతా వైర్‌లెస్‌గా సాధ్యమవుతోంది. ప్రపంచ వై-ఫై దినోత్సవాన్ని పురస్కరించుకుని, మనం ఈ సాంకేతికత, దాని చరిత్ర మరియు భవిష్యత్తును నిశితంగా పరిశీలిద్దాం, ప్రశంసిద్దాం.



-మధుపాళీ
9949700037

# "ఈ దేశం మన యువతదే: వికసిత్ భారత్ 2047 దిశగా సాగే ప్రయాణంలో వారు చురుకైన భాగస్వాములు కావాలి"

## -యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రక్షా ఖడ్సే పిలుపు

న్యూఢిల్లీ,జూన్ 19:దేశ వ్యాప్తంగా ఉన్న యువతలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించే వికసిత్ భారత్ యువ పార్లమెంట్ 2026 జాతీయ స్థాయి సమావేశాలు నేడు పార్లమెంట్ భవనంలో చారిత్రాత్మక సంవిధాన్ సదన్‌లో అవార్డుల ప్రధానోత్సవంతో ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ జాతీయ స్థాయి సదస్సులో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎంపికైన 105 మంది యువ ప్రతిభావంతులు పాల్గొన్నారు. వీరంతా పార్లమెంటరీ చర్చలు, ప్రజాస్వామ్య భాగస్వామ్యం, వికసిత్ భారత్ఏ2047 సాధనపై లోతైన చర్చలు, ఆలోచనలను పంచుకున్నారు.

ఈ ముగింపు, అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రక్షా ఖడ్సే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో యువజన వ్యవహారాల శాఖ కార్యదర్శి డాక్టర్ పల్లవి జైన్ గోవిల్, అదనపు కార్యదర్శి శ్రీ నితీష్ కుమార్ మిశ్రా, సంయుక్త కార్యదర్శి శ్రీ శివ్ రతన్ తదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి శ్రీమతి ఖడ్సే మాట్లాడుతూ, 'వికసిత్ భారత్ఏ 2047' దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో యువత తప్పనిసరిగా క్రియాశీల భాగస్వాములు కావాలని చెప్పారు. యువత ప్రజాస్వామ్య సంస్థలతో మమేకమవ్వడానికి, జాతీయ చర్చలకు, దేశ నిర్మాణానికి దోహదపడటానికి వీలు కల్పించే ఒక వేదికగా యువ పార్లమెంట్‌ను ఆమె అభివర్ణించారు. అలాగే దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత ఆకాంక్షలను, భాగస్వామ్యాన్ని సరైన మార్గంలో నడిపించేందుకు 'మై భారత్' ఒక కీలకమైన కార్యక్రమమని తెలిపారు.

'వికసిత్ భారత్ యువ పార్లమెంట్ 2026' వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతల ప్రకటన, బహుమతుల ప్రధానోత్సవంతో ముగిసింది. ఉత్తమ ప్రారంభ వక్త (రియా పాండే,ఢిల్లీ), ఉత్తమ ప్రశ్న (అపూర్వ శర్మ,హర్యానా), ఉత్తమ సమాధానకర్త (కెపోజో కపుహ్, నాగాలాండ్), ఉత్తమ స్వల్పకాలిక చర్చ(సైన్ చిరాగ్ కుమార్, దాద్రా అండ్ నగర్ హవేలీ, డామన్ అండ్ దియూ) విజేతలుగా నిలిచారు.

కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన యువజన వ్యవహారాల విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. యువత ప్రజాస్వామ్య ప్రక్రియలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి, వారి నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, దేశ నిర్మాణంలో తమ వినూత్న ఆలోచనలను పంచుకోవడానికి ఈ కార్యక్రమం ఒక అద్భుతమైన వేదికను కల్పించింది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది, జాతీయ స్థాయికి ఎంపికైన ఈ ప్రతిభావంతులంతా దేశ యువత వైవిధ్యాన్ని, వారి ఉన్నత ఆకాంక్షలను, నాయకత్వ సామర్థ్యాన్ని ఈ వేదికపై ప్రతిబింబించారు.

ఈ కార్యక్రమం జరిగినంత సేపూ యువ ప్రతినిధులు అసలు సిసలు పార్లమెంటరీ తరహా నడుమ చర్చలు, ప్రశ్నోత్తరాల సమయం, స్వల్పకాలిక చర్చలు, జాతీయ ప్రాధాన్యత కలిగిన వివిధ అంశాలపై నేపథ్యపరమైన చర్చల్లో అత్యంత చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో, దేశ ప్రగతి ప్రయాణంలో భాగస్వామ్యం పంచుకోవడంలో భారతీయ యువతకు ఉన్న సామాజిక స్పృహ, సృజనాత్మకత, వారి దృఢ సంకల్పాన్ని ఈ చర్చలు స్పష్టంగా చాటిచెప్పాయి.

ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (అంతర్జాతీయ సహకారం) డైరెక్టర్ డాక్టర్ సారా జయల్ సాక్మీ.. 2026లో భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత అనే అంశంపై ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ జనాభాలో దాదాపు 45 శాతం మంది బ్రిక్స్ దేశాల్లోనే ఉన్నారని, ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల సమూహంగా ఇది నిలిచిందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ క్రమంలో భారత్‌కు ఉన్నఅపారమైన యువ శక్తి కేవలం దేశానికే కాకుండా, ప్రపంచ బలానికి ఒక ముఖ్యమైన వనరుగా మారిందని అభివర్ణించారు. అలాగే 2026 సంవత్సరానికి గాను భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత యొక్క ప్రధాన థీమ్ 'సహకారం, సుస్థిరత కోసం స్థితిస్థాపకత, ఆవిష్కరణలను పెంపొందించడం' అనే అంశం గురించి ఆమె యువతకు సుదీర్ఘంగా వివరించారు.

కార్యక్రమ ముగింపు ఉపన్యాసంలో 'మై భారత్' సీఈఓ డాక్టర్ ప్రియాంక శుక్లా యువ ప్రతినిధుల ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ... ఈ కార్యక్రమం 105 మందితో ప్రారంభమైనప్పటికీ, ముగిసే సమయానికి 105 సరికొత్త కలలు, ఉన్నత ఆకాంక్షలు 'మై భారత్'తో చేతులు కలిపాయని కొనియాడారు. యువత జరిపిన చర్చలను, వారు కనబరిచిన ప్రతిభను అభినందిస్తూ.. ఇక్కడ విజేతలకు ఇచ్చే అవార్డులు పరిమితంగానే ఉండవచ్చు, కానీ యువతీయువకులు ప్రదర్శించిన ప్రతిభ, వారిలోని అపారమైన సామర్థ్యానికి మాత్రం ఎలాంటి హద్దులు లేవని అన్నారు.

ఈ యువ పార్లమెంట్ కార్యక్రమం.. దేశ నిర్మాణంలో యువతను చురుకైన భాగస్వాములుగా మార్చడానికి, వికసిత్ భారత్ఏ2047 స్వప్నాన్ని సాకారం చేయడంలో వారి పాత్రను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది.

# గుజరాత్‌లో రూ. 493 కోట్లతో ఆదిపూర్-భుజ్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టుకు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం

న్యూఢిల్లీ, జూన్ 19:గుజరాత్‌లో రైల్వే మౌలిక సదుపాయాల వృద్ధికి, రవాణా సామర్థ్య పెంపునకు భారతీయ రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పశ్చిమ రైల్వే పరిధిలోని 49 కిలోమీటర్ల పొడవైన ఆదిపూర్-భుజ్ రైల్వే సెక్షన్‌ను రూ. 493 కోట్ల వ్యయంతో డబ్లింగ్ (రెండు లైన్లుగా మార్చడం) చేయడానికి రైల్వే శాఖ ఆమోదం తెలిపింది.

రైల్వే లైన్ల డబ్లింగ్, ట్రిప్లింగ్, నెట్‌వర్క్ విస్తరణ ద్వారా రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు భారతీయ రైల్వే నిరంతరం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత కలిగిన ఈ రైల్వే లైన్ డబ్లింగ్ పూర్తి కావడం ద్వారా కచ్ ప్రాంతంలో రైలు రవాణా మరింత బలోపేతం కానుంది. భవిష్యత్తులో ఈ మార్గంలో పెరగనున్న ప్రయాణికుల, సరుకు రవాణా రద్దీకి ఇది ఎంతగానో తోడ్పడుతుంది.

### వేగంగా పెరుగుతున్న ట్రాఫిక్ కారిడార్‌లో సామర్థ్య పెంపు

గాంధీధామ్- నలియా కారిడార్‌లో ప్రస్తుతం ఒకే ఒక ట్రాక్ మార్గంగా ఉన్న ఈ ఆదిపూర్-భుజ్ సెక్షన్‌లో ఇప్పటికే పలు రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగంగా అమలవుతున్నాయి. వీటిలో భుజ్-నలియా గేజ్ మార్పిడి పనులు, నలియా-వాయెర్ లైన్ పొడిగింపు, నలియా-జఖౌ, వాయెర్- లఖ్‌పత్, దేశాల్‌పర్- లూనా ప్రాంతాలను కలుపుతూ నిర్మిస్తున్న కొత్త రైల్వే లైన్లు ఉన్నాయి. వీటి కారణంగా ఈ ప్రాంతంలో రాబోయే రోజుల్లో రైళ్ల రాకపోకలు భారీగా పెరిగే అవకాశం ఉంది.

ఈ రైల్వే ప్రాజెక్టులన్నీ త్వరలోనే పూర్తి కానుండటంతో ఆ మార్గం ద్వారా అదనపు ప్యాసింజర్, సరుకు రవాణా రైళ్ల రాకపోకలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీకి తగిన సామర్థ్యాన్ని కల్పించడానికి, రైళ్ల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడానికి, భవిష్యత్తు రవాణా డిమాండును తట్టుకోవడానికి వీలుగా ఈ డబ్లింగ్ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యతతో ఆమోదం లభించింది.

### మెరుగైన ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల నిర్వహణ:

ఈ డబ్లింగ్ ప్రాజెక్టు పూర్తి కావడం వల్ల ప్రయాణికులకు, సరుకు రవాణా రంగానికి ఎంతో మేలు జరగనుంది. ఈ మార్గంలో ప్రతిరోజూ రెండు వైపులా కలిపి అదనంగా 4 ప్రయాణికుల రైళ్లను నడపడానికి వీలవుతుంది. ఇది ఈ ప్రాంతంలోని ప్రయాణికులకు రవాణా సౌకర్యాన్ని, రవాణాను మరింత మెరుగుపరుస్తుంది.

ఈ డబుల్ లైన్ ద్వారా ప్రతి సంవత్సరం అదనంగా 12 మిలియన్ టన్నులకు రవాణా సాధ్యమవుతుంది. ఇది పశ్చిమ గుజరాత్‌లో రవాణా రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, పారిశ్రామిక అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

### భవిష్యత్తు వృద్ధి, నిర్వహణకు ఊతం

ఈ రైల్వే సెక్షన్ లైన్ సామర్థ్య వినియోగం రాబోయే 2029-30 నాటికి ఏకంగా 123 శాతానికి పెరిగే అవకాశం అంచనా వేస్తున్నారు. ఇది సకాలంలో సామర్థ్యాన్ని పెంచడం ఎంత అవసరమో తెలియజేస్తుంది. ప్రస్తుతం చేపట్టబోయే డబ్లింగ్ పనులు ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గిస్తాయి. అలాగే రైళ్ల నిర్వహణలో ఉన్న అడ్డంకులను తొలగించి, రైళ్లు మరింత ఖచ్చితత్వంతో, నమ్మకంగా నడవడానికి దోహదపడతాయి. ప్రయాణికులు, సరుకు రవాణా పెరగడం ద్వారా భారతీయ రైల్వేకు అదనపు ఆదాయం సమకూరడమే కాకుండా, కచ్ ప్రాంతంలో ఆర్థిక వృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతగానో తోడ్పడుతుంది. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలపడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా మౌలిక వసతులను సృష్టించడం, రైలు ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడం, దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చడం కోసం భారతీయ రైల్వే నిరంతరం కృషి చేస్తోందని మరోసారి నిరూపితమైంది.

# త్యాగాల కుటుంబ ఆణిముత్యం రాహుల్ గాంధీ: ఎమ్మెల్యే

నిజామాబాద్, జూన్ 19:దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబ వారసత్వం నుంచి వచ్చిన ఆణిముత్యం రాహుల్ గాంధీ అని జుక్కల్ శాసనసభ్యుడు తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

దేశ సమగ్రత, సామాజిక న్యాయం, ప్రజాసేవ కోసం నిరంతరం కృషి చేస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు.

భారతదేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించే ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు ఆయనలో ఉన్నాయని అన్నారు.

రాహుల్ గాంధీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని తోట లక్ష్మీకాంతరావు ఆకాంక్షించారు.

# ముత్యాలమ్మగూడెం వద్ద విషాద ఘటన



నల్గొండ, జూన్ 19: నల్గొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దవూర-నాగార్జునసాగర్ మార్గంలోని ముత్యాలమ్మగూడెం సమీపంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు.

ప్రమాదం తీవ్రతకు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో ప్రయాణికులు వాహనాల్లోనే చిక్కుకుపోయినట్లు సమాచారం. ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుల వివరాలు, ఇతర సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

# అసత్య ప్రచారాలు మానుకోవాలి: బొడ్డు గంగన్న



ఆదిలాబాద్, జూన్ 19:ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపై కొందరు సామాజిక మాధ్యమాల వేదికగా అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి దుష్ప్రచారాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని కడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు గంగన్న అన్నారు. శుక్రవారం కడెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే రూ.3 కోట్ల విలువైన కారు వినియోగిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలో భాగమేనని పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడిపై రాజకీయ కక్షతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఎమ్మెల్యేకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక రాజకీయ ప్రత్యర్థులు దుష్ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. గ్రామ గ్రామాన పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న ప్రజా నాయకుడిపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నామని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలి స్తున్నామని హెచ్చరించారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలను తెలుసుకుని స్పందించాలని కోరారు. దుష్ప్రచారాలు ఎంత చేసినా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నాయకత్వంలో ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఆర్‌టీఏ సభ్యుడు మల్లేష్ యాదవ్, సర్పంచ్‌ల వేదిక కడెం మండల అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్, జిల్లా యువజన కార్యదర్శి ముడికే మల్లేష్, కడెం పెద్దూర్ సర్పంచ్ దీకొండ విజయ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ప్రాణహిత నదిలో డిగ్రీ విద్యార్థి గల్లంతు

ఆదిలాబాద్, జూన్ 19:మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం వెంచపెల్లి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి పబ్బ అజయ్ గౌడ్ ప్రాణహిత నదిలో గల్లంతయ్యాడు.

తెలిసిన వివరాల ప్రకారం, వెంచపెల్లి గ్రామానికి చెందిన అజయ్ తన స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు సమీపంలోని రాచర్ల గ్రామం వద్ద ప్రాణహిత నదికి వెళ్లాడు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు నదిలో మునిగి గల్లంతైనట్లు సమాచారం.

సమాచారం అందుకున్న కోటపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక జాలర్ల సహాయంతో నదిలో అజయ్ కోసం వెతుకుతున్నారు.

ఈ ఘటనతో వెంచపెల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# వారసత్వం నుంచి ఆశాభావం దాకా: 19వ ముంబయి ఫెస్టివల్‌లో

# భారత బహుముఖ ప్రతిష్టను ఆవిష్కరిస్తున్న వర్ధమాన చిత్ర దర్శకులు

న్యూఢిల్లీ, జూన్ 19: ముంబయిలో నిర్వహిస్తున్న 19వ 'ఎంఐఎఫ్ఎఫ్'లో యువ చిత్ర దర్శకుల దృక్కోణంతో ప్రపంచాన్ని వీక్షించే అవకాశాన్ని "ఎమర్జింగ్ వాయిసెస్: ఫిల్మ్ స్కూల్ ఎడిషన్'' విభాగం ప్రేక్షకులకు కల్పిస్తోంది. దీనికింద ఫ్రాన్స్, జర్మనీలలోని ప్రసిద్ధ ఫిల్మ్ స్కూల్స్ చిత్రాలు సహా ఈశాన్య ప్రాంతంతోపాటు భారత్‌లోని వివిధ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ల నుంచి 27 చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. భారత ప్రజానీకం, సంస్కృతులు, అనుభవాల విస్తృత, సుసంపన్న వైవిధ్యాన్ని ఈ చిత్రాలన్నీ ప్రతిబింబిస్తాయి. అలాగే... గుర్తింపు, సంస్కృతి, కుటుంబం, సామాజిక సమస్యలు, ఆశాభావం, మానసిక దృఢత్వం, మానవ సంబంధాలు వంటి వివిధ భావోద్వేగాలను కూడా ఇవి స్పృశిస్తాయి. వేడుకలు కొనసాగినన్ని రోజులూ ఈ చిత్రాలను ప్రదర్శిస్తారు.

ఈ విభాగం కింద పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా నుంచి 4, కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ నుంచి 3, తమిళనాడులోని ఆరోవిల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ నుంచి 4, కటక్‌లోని బిజూ పట్నాయక్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా నుంచి 1, అస్సాంలోని డాక్టర్ భూపేన్ హజారికా రీజినల్ గవర్నమెంట్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ నుంచి 2, అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ నుంచి 3, కర్ణాటకలోని ఆర్.వి.యూనివర్సిటీ నుంచి 4, రోహ్‌తక్‌లోని దాదా లక్ష్మి చంద్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ పెర్ఫార్మింగ్ అండ్ విజువల్ ఆర్ట్స్ నుంచి 3, ముంబయిలోని విజ్లింగ్ వుడ్స్ ఇంటర్నేషనల్ నుంచి 3 వంతున చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఇవన్నీ దేశంలోని వేర్వేరు ప్రాంతాల వైవిధ్యాన్ని, కథలను ప్రేక్షకుల కళ్లకు కడతాయి.

స్థానిక సంప్రదాయాలు, సంస్కృతి, తరతరాలుగా సంక్రమించిన జ్ఞాన పరిరక్షణకుగల ప్రాధాన్యాన్ని కొన్ని ప్రముఖ చిత్రాలు ప్రస్ఫుటం చేస్తాయి. వీటిలో 'ఎఫ్‌టీటీఐ' రూపొందించిన "ఇన్ సెర్చ్ ఆఫ్ స్టోన్" చిత్రం ప్రాచీన ప్రదేశాలతో ప్రజలకుగల అనుబంధాన్ని అన్వేషిస్తూ, వాటి పరిరక్షణ ఆవశ్యకతను ఉత్తేజితం చేస్తుంది. అలాగే, 'ఎస్ఆర్ ఎఫ్‌టీఐ' రూపొందించిన "బ్లాక్ క్లే'' (ఖివ్ రావెమ్) చిత్రం సంప్రదాయ చేతివృత్తులను, భవిష్యత్తు కోసం వాటిని పరిరక్షించాల్సిన అవసరాన్ని ప్రముఖంగా చాటుతుంది. కొన్ని చిత్రాలు రోజువారీ జీవితంలోని సవాళ్లను పరిశీలిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు ప్రజలను ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోకి, కష్టమైన నిర్ణయాలవైపు నెడతాయో 'ఎస్ఆర్ఎంటీఐ' తీసిన "దుర్జోగ్" చిత్రం తెలియజేస్తుంది. ఒక ప్రకృతి వైపరీత్యం తర్వాత ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకోవడంలో ఎదురయ్యే నష్టం, పునరుత్థానం గురించి "ది లాస్ట్ హెర్డ్'' (మొయిషాల్) కథ వివరిస్తుంది.

కుటుంబం, వ్యక్తిగత సంబంధాలు కూడా కీలక ఇతివృత్తాలే. ఆత్మీయులను ఆదరంగా చూసుకోవాల్సిన బాధ్యతను, ఆ బాధ్యతలు కుటుంబాలను ప్రభావితం చేసే తీరును "కేప్ ఆఫ్ గుడ్ హోప్" వివరిస్తుంది. ప్రేమ, జ్ఞాపకాలు, ప్రజలు తమ సొంత ఇళ్లతో పంచుకునే బలమైన బంధాన్ని "నాగాలాండ్-ఒక దృశ్య కావ్యం" అన్వేషిస్తుంది. యువత స్వప్నాలు.. పోరాటాలు 'ఎల్-ఎర్న్' (తాల్-మేల్)లో ప్రతిబింబిస్తాయి. యువ సంగీత కారుల జీవితాల ద్వారా, కష్ట సమయాల్లోనూ ఆత్మవిశ్వాసం కలిగించిన, లక్ష్యాన్ని ఉత్తేజితం చేసి, ఆశను చిగురింప జేయగలదో ఈ చిత్రం ప్రస్ఫుటం చేస్తుంది.

మొత్తం మీద భారత్ సహా, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల కథలను "ఎమర్జింగ్ వాయిసెస్: ఫిల్మ్ స్కూల్ ఎడిషన్'' విభాగంలోని చిత్రాలన్నీ సమగ్రంగా వివరిస్తాయి. స్థానిక సమాజాలు, నిజ జీవితానుభవాలతో మమేకమైన ఈ చిత్రాలు, యువ దర్శకుల సృజనాత్మకతను ప్రముఖంగా చూపుతూ- ప్రజలు, సంస్కృతి, సమాజంపై ఆలోచనాత్మక ధోరణిని ఉత్తేజితం చేస్తాయి.

## విద్యాసంస్థల సమీపంలోని పాన్ షాపులపై ప్రత్యేక నిఘా

కరీంనగర్, జూన్ 19: మాదకద్రవ్యాల నియంత్రణకు కరీంనగర్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న పాన్ షాపులు, కిల్లీ షాపుల్లో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. యువత మాదకద్రవ్యాలు, మత్తు కలిగించే పదార్థాల బారిన పడుతున్నారనే సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. ముఖ్యంగా మత్తును కలిగించే చాక్లెట్లు, ఇతర నిషేధిత పదార్థాల విక్రయాలపై దృష్టి సారించి షాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో త్రీటౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు, జగదీశ్వర్ తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వన సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



కరీంనగర్, జూన్ 19:పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ప్రధాన అటవీ సంరక్షణ అధికారి ప్రభాకర్, జిల్లా అటవీ అధికారి నవీన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మొక్కల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటి వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా వనమహోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

# ప్రామాణిక గళాలు, మాతృభాషా కథనాలు ప్రపంచ సినిమాను పునర్నిర్మిస్తున్నాయి: ఆనంద్ వరదరాజ్

న్యూఢిల్లీ, జూన్ 19:"విభిన్న గళాలను వినిపించడంలో, వర్ధమాన ప్రతిభను పోషించడంలో, సినిమా వారసత్వాన్ని పరిరక్షించడంలో, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడంలో చలనచిత్రోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయి"...

ఇది... 19వ ముంబై అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఎమ్ఐఎఫ్ఎఫ్) సందర్భంగా ఈరోజు జరిగిన "అనేక రూపాలు, ఒకే దృక్పథం: చలనచిత్రోత్సవాల్లో వైవిధ్యాల ప్రదర్శన" శీర్షికతో జరిగిన రౌండ్ టేబుల్ చర్చలో వక్తలు వ్యక్తం చేసిన అభిప్రాయం.

చిత్రరూపకర్తలు, విమర్శకులు, చిత్రోత్సవ డైరెక్టర్లు, పరిశ్రమ నిపుణులను ఒకచోట చేర్చిన ఈ చర్చ... సాంకేతిక ఆవిష్కరణలు, మారుతున్న ప్రేక్షకుల అభిరుచులు, వాస్తవిక కథనానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ యుగంలో చలనచిత్రోత్సవాలు నిరంతరం అభివృద్ధి చెందుతున్న తీరును అన్వేషించింది.

ఈ సమావేశానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన పురస్కార గ్రహీత నటి షీనా చోహన్... విభిన్న సంస్కృతులు, అనుభవాలు గల ప్రజలను అనుసంధానించడంలో కథనానికి గల శక్తిని ప్రధానంగా ప్రస్తావించారు. ఒక చలనచిత్రోత్సవం ప్రపంచాన్ని విభిన్న కోణాల నుంచి చూసేందుకు... అవగాహనను, సానుభూతిని పెంపొందించగల కథలతో మమేకమయ్యేందుకు ప్రేక్షకులకు అవకాశం కల్పిస్తుందని ఆమె ఈ చర్చ ప్రారంభోపన్యాసంలో పేర్కొన్నారు. క్రెడిట్స్ ముగిసిన చాలా కాలం తర్వాత కూడా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయే చిత్రాలు, తరచుగా స్థానిక అనుభవాల ద్వారా సార్వత్రిక సత్యాలను వ్యక్తపరిచేవేనని ఆమె పేర్కొన్నారు.

చిత్రోత్సవ వాతావరణంలో సినిమాలు చూడటంలోని విశిష్టమైన అనుభవం గురించి బెంగళూరు అంతర్జాతీయ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ (బీఐఎస్ఎఫ్ఎఫ్) వ్యవస్థాపకులు, ఆర్టిస్టిక్ డైరెక్టర్ ఆనంద్ వరదరాజ్ మాట్లాడుతూ... సినిమా ప్రాథమికంగా ఒక సామూహిక అనుభవమని అన్నారు. చీకటిగా ఉండే థియేటర్‌లో ఇతరులతో కలిసి సినిమా చూడటం... మరెక్కడా పునరావృతం చేయలేని ఒక ఉమ్మడి భావోద్వేగ ప్రయాణాన్ని సృష్టిస్తుందని ఆయన తెలిపారు. ఒక శక్తిమంతమైన సన్నివేశానికి ప్రేక్షకుల సామూహిక స్పందన, ఒక కళారూపంగా సినిమా సారాంశాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాన స్రవంతికి చెందని భాషల్లో నిర్మిస్తున్న చిత్రాల సంఖ్య పెరుగుతోందని పేర్కొంటూ... ప్రపంచ సినిమాలో మారుతున్న ధోరణులనూ ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. చిత్రరూపకర్తలు, రచయితలు తమ మాతృభాషల్లో చిత్రాలను రూపొందించడానికి ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని, దీని ఫలితంగా మరింత సుసంపన్నమైన, ప్రామాణికమైన కథనాలు వెలువడుతున్నాయని ఆయన అన్నారు. కేవలం మెట్రో నగరాల నుంచే కాకుండా, ఇప్పుడు చిన్న పట్టణాలు, మారుమూల ప్రాంతాల నుంచి ఎన్నో అద్భుతమైన చిత్రాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో, చిత్రరూపకర్తలు తమ కథలను చెప్పడానికి యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, కృత్రిమ మేధ వంటి అధునాతన పద్ధతులను సృజనాత్మక సాధనాలుగా స్వీకరిస్తున్నారని ఆయన తెలిపారు.

లఘు చిత్రాలకు పెరుగుతున్న ప్రజాదరణ గురించి చర్చిస్తూ... నేటి ప్రేక్షకులు సమకాలీన జీవనశైలికి సరిపోయేవి, అర్థవంతమైనవి అయిన కథనాలను అందించే కంటెంట్‌ను కోరుకుంటున్నారని ఆయన అన్నారు. సమయం ఒక విలాసంగా మారిన ఈ రోజుల్లో, చలనచిత్రోత్సవాలు నాణ్యమైన లఘు చిత్రాలను గుర్తించి, ప్రదర్శించడం ద్వారా ఒక గురుతర బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి. దిగ్గజ చిత్రరూపకర్తలు రూపొందించిన అంతగా ప్రాచుర్యం పొందని చిత్రాలనూ ప్రేక్షకులకు పరిచయం చేయడానికీ ఈ ఉత్సవాలు సహాయపడతాయి. బీఐఎస్ఎఫ్ఎఫ్‌లో రిత్విక్ ఘటక్ రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించడంతో... ఆయన గొప్ప లఘు చిత్రాలనూ తీశారని ప్రేక్షకులకు తెలిసింది.

సినిమా సంస్కృతిని తీర్చిదిద్దడంలో చలనచిత్రోత్సవాల పాత్రను ప్రముఖంగా ప్రస్తావించిన సినీ విమర్శకులు, ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు ప్రేమేంద్ర మజుందార్... సినిమాను ఒక సామూహిక కళారూపంగా, సినిమా వీక్షణను ఒక సామూహిక కార్యకలాపంగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా అర్థవంతమైన సినిమాను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించిన భారత సుదీర్ఘకాల ఫిల్మ్ సొసైటీ ఉద్యమానికి చలనచిత్రోత్సవాలు ఒక సహజమైన కొనసాగింపు అని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా చలనచిత్రోత్సవాల వేగవంతమైన వృద్ధికి డిజిటల్ విప్లవం దోహదపడిందనీ ఆయన పేర్కొన్నారు. ఈ విస్తరణ చిత్రనిర్మాతలకు మరిన్ని అవకాశాలను సృష్టించినప్పటికీ... ఇది నాణ్యత, నియంత్రణకు సంబంధించిన సవాళ్లనూ తెచ్చిపెట్టింది. కళాత్మక శ్రేష్ఠతను ప్రోత్సహించడం, సాంస్కృతిక చర్చలు కొనసాగించడం, చలనచిత్రోత్సవ ఉద్యమానికి మొదట స్ఫూర్తినిచ్చిన విలువలను పరిరక్షించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు.

చలనచిత్రోత్సవాలు తరతరాలుగా ప్రేక్షకులను ఆకర్షిస్తూనే ఉన్నాయని ప్రేమేంద్ర మజుందార్ పేర్కొన్నారు. వాణిజ్య ప్రదర్శనల వలె కాకుండా, ఈ చిత్రోత్సవ ప్రేక్షకుల్లో తరచుగా చిత్ర రూపకర్తలు, విమర్శకులు, సినిమా ఔత్సాహికులు భాగమై... ఆయా చిత్రాల కథనాల్లో పూర్తిగా లీనమయ్యేలా ప్రోత్సహించే వాతావరణాన్ని సృష్టిస్తారు. చాలా మంది పేరు పొందిన చిత్రరూపకర్తలు... వారి తొలి గుర్తింపు చిత్రోత్సవాల ద్వారా పొందినవారే.

యానిమేషన్ చిత్రం రూపకర్తలకు గల అవకాశాలు, ఆ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై మాట్లాడిన తెలంగాణ వీఎఫ్ఎక్స్, యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ (టీవీఏజీఏ) కన్సల్టెంట్ సావిత్రి హరి... యానిమేషన్‌ను ఇప్పటికీ ప్రధానంగా పిల్లల వినోద మాధ్యమంగానే చూస్తున్నారని అభిప్రాయపడ్డారు. యానిమేషన్‌లో కళాత్మకంగా కథ చెప్పే సామర్థ్యం ఉన్నప్పటికీ... ఈ అభిప్రాయం ఫైనాన్సింగ్, పంపిణీలో అడ్డంకులను సృష్టిస్తోందని ఆమె అన్నారు. అంతర్జాతీయ ఉత్సవాల్లో భారతీయ యానిమేషన్‌కు గుర్తింపు పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. అయితే, భాషా ప్రాధాన్యాలు, పంపిణీ పద్ధతులు అనేక ప్రాజెక్టుల ప్రపంచవ్యాప్త విస్తరణను పరిమితం చేస్తున్నాయని ఆమె అన్నారు. చిత్ర రూపకర్తలు కేవలం సృజనాత్మకంగానే కాకుండా... మేధో సంపత్తి వ్యూహాలను అభివృద్ధి చేసుకోవడం, అంతర్జాతీయ మార్కెట్లను అర్థం చేసుకోవడం ద్వారా వాణిజ్యపరంగానూ సిద్ధంగా ఉండాలని సావిత్రి హరి ప్రోత్సహించారు. మార్గదర్శకులు, పరిశ్రమ నిపుణులు, ప్రపంచవ్యాప్త ప్రేక్షకులతో చిత్రరూపకర్తలు అనుసంధానం కావడానికి ఈ చిత్రోత్సవాలు సహాయపడతాయని ఆమె తెలిపారు.

నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ మగ్దుమ్ మాట్లాడుతూ... భవిష్యత్ తరాల కోసం చిత్రాలను పరిరక్షించాల్సిన ప్రాముఖ్యతను స్పష్టం చేశారు. చిత్ర పరిరక్షణ వల్ల సినిమా చరిత్ర రాబోయే తరాలకు, కొత్త ప్రేక్షకులకు అందుబాటులో ఉంటుందని ఆయన అన్నారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రధాన చలనచిత్రోత్సవాలు ఇప్పుడు పునరుద్ధరించిన క్లాసిక్ చిత్రాల కోసం ప్రత్యేక విభాగాలను కేటాయిస్తున్నాయని ఆయన వివరించారు.

చిత్ర నిర్మాణం, చలనచిత్రోత్సవాలపై సాంకేతికత ప్రభావం గురించీ ఆయన మాట్లాడారు. డిజిటల్ వేదికలు, విభిన్న నేపథ్యాలకు చెందిన చిత్రరూపకర్తలు ప్రపంచవ్యాప్త ఉత్సవాలకు తమ చిత్రాలను సమర్పించడాన్ని సులభతరం చేశాయి. యానిమేషన్, మోషన్ గ్రాఫిక్స్, కృత్రిమ మేధలో పురోగతి సృజనాత్మక అవకాశాలను విస్తరింపజేస్తోంది. ఏఐ చిత్రాల కోసం ప్రత్యేకంగా ఎమ్ఐఎఫ్ఎఫ్ ఏర్పాటు చేసిన విభాగాన్ని ప్రస్తావిస్తూ... ఒక చిత్రాన్ని రూపొందించడానికి ఉపయోగించిన సాంకేతికత కంటే, అందులోని భావోద్వేగ ప్రామాణికతకే ప్రేక్షకులు ఎక్కువగా స్పందిస్తారని ఆయన అన్నారు.

సొసైటీ ఫర్ ఆదివాసీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఎస్ఏఎఫ్‌డీఎఫ్), బరివడ నేషనల్ ఇండీజీనస్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వ్యవస్థాపకులు, పురస్కార గ్రహీత, ప్రముఖ చిత్రరూపకర్త దీపక్ కుమార్ బేష్రా మాట్లాడుతూ... ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో ప్రామాణికత కీలకంగా ఉంటుంది. ఆదివాసీ, గిరిజన వర్గాలు తమ కథలను విస్తృత ప్రేక్షకులతో పంచుకోవడానికి చలనచిత్రోత్సవాలు అమూల్యమైన అవకాశాలను అందిస్తాయని ఆయన అన్నారు. తమ సొంత జీవితాలు, సంస్కృతులు, అనుభవాలను ప్రతిబింబించే కథలతోనే ప్రేక్షకులు తరచుగా బలంగా మమేకమవుతారని దీపక్ కుమార్ బేష్రా పేర్కొన్నారు. ప్రామాణికత భౌగోళిక సరిహద్దులను అధిగమించి ప్రపంచవ్యాప్త ప్రేక్షకులను ఆకర్షించగలదనడానికి... స్థానిక సంప్రదాయాలు, భాషలతో ముడిపడిన చిత్రాలకు పెరుగుతున్న గుర్తింపే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

ఆసియాలోనే తొలి డాక్యుమెంటరీ ఇంక్యుబేటర్ డాక్ఎడ్జ్ కోల్‌కతా వ్యవస్థాపక-అధ్యక్షులు నీలోత్పల్ మజుందార్ మాట్లాడుతూ... డాక్యుమెంటరీ చిత్రనిర్మాణంలో మారుతున్న పరిస్థితుల గురించి ప్రస్తావించారు. గత దశాబ్ద కాలంలో భారతీయ డాక్యుమెంటరీలు గణనీయ పరివర్తనకు లోనయ్యాయని, చిత్రరూపకర్తలు విస్తృత శ్రేణి అంశాలను, కథ చెప్పే విధానాలనూ అన్వేషిస్తున్నారని ఆయన గమనించారు. డాక్యుమెంటరీలు... సమస్యలు, భావోద్వేగాలు, వాస్తవ జీవితాలను ఒకచోట చేర్చి, చారిత్రక చైతన్యాన్ని పెంపొందించడంలో సహాయపడతాయని ఆయన అన్నారు. చాలా మంది డాక్యుమెంటరీ చిత్రాల రూపకర్తలు పరిమిత వనరులతోనే పనిచేస్తున్నప్పటికీ... వారి నిబద్ధత, అభిరుచి ఫలితంగా ఎన్నో ప్రభావవంతమైన చిత్రాలు వెలువడుతున్నాయని ఆయన తెలిపారు. వర్ధమాన డాక్యుమెంటరీ చిత్రరూపకర్తలు తమ సామర్థ్యాన్ని గ్రహించేలా సహాయపడటానికి మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి, సంస్థాగత మద్దతు అవసరమని ఆయన స్పష్టం చేశారు.

# టూరిజమే ఏపీ భవిష్యత్తు..

### -రెండేళ్లలో రూ. 20 వేల కోట్ల పెట్టుబడులు
### -పర్యాటక రంగంలో విప్లవాత్మక మార్పులు
### -దేశంలో 13వ స్థానం లో ఏపీ
### -1.22 లక్షల ఉద్యోగాల లక్ష్యం
### -పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



అమరావతి, జూన్ 19:పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం నుంచి భారీ పెట్టుబడుల ఆకర్షణ వరకు, జాతీయ స్థాయి అవార్డుల నుంచి ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. రెండేళ్ల పాలనలో శాఖల వారీగా సాధించిన ప్రగతిని వివరించిన మంత్రి దుర్గేష్, రాష్ట్రంలో పర్యాటక రంగం కొత్త శకానికి శ్రీకారం చుట్టిందన్నారు. 2019-24 మధ్య పర్యాటక రంగం వెనుకబడిపోయినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. గత రెండేళ్లలో దేశీయ పర్యాటకుల రాక 17 శాతం పెరిగి 37 కోట్ల ఫుట్‌ఫాల్ నమోదైందని, విదేశీ పర్యాటకుల సంఖ్య 2.62 లక్షలకు చేరిందని వెల్లడించారు. ఫలితంగా దేశంలో 16వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం 13వ స్థానానికి చేరుకుందని తెలిపారు.

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెంచేందుకు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి 2024-29 టూరిజం పాలసీ అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. దీని ఫలితంగా 117 ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదిరాయని, రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించగలిగామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమలైతే 1,22,637 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 4,390 హోటల్ గదులకు అదనంగా మరో 9,042 గదులు అందుబాటులోకి వచ్చేలా 50 కొత్త హోటళ్లకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 50 వేల గదులు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ లక్ష్యం నెరవేరితే దేశంలో టాప్-5 పర్యాటక రాష్ట్రాల్లో ఏపీ నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం, అరకు, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిని యాంకర్ హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామని, 25 ప్రత్యేక పర్యాటక సర్క్యూట్ల రూపకల్పన జరుగుతోందని వెల్లడించారు. క్రూయిజ్ టూరిజం, క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టేలు, అడ్వెంచర్ టూరిజం, వెల్‌నెస్ టూరిజం వంటి రంగాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు చెప్పారు.

పర్యాటకుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక బీచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. తీర ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు పెంచి పర్యాటకులకు మరింత రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 1,855 హోమ్‌స్టేలను అనుసంధానం చేస్తూ ప్రత్యేక హోమ్‌స్టే పోర్టల్‌ను సిద్ధం చేశామని వివరించారు. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించే క్రమంలో రాష్ట్రంలోని 21 ప్రధాన ఆలయాల వద్ద టెంట్ సిటీల ఏర్పాటు ప్రతిపాదనను అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అన్నవరం, సింహాచలం, అహోబిలం, నాగార్జునసాగర్ బౌద్ధ సర్క్యూట్ వంటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం భారీ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. గోదావరి తీర అభివృద్ధి, గండికోట, సూర్యలంక బీచ్ అభివృద్ధి వంటి ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు.

రాష్ట్ర పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇటీవల కేరళలో జరిగిన జాతీయ సదస్సులో ఆంధ్రప్రదేశ్‌కు 'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్' అవార్డు దక్కిందని తెలిపారు. అరకు వ్యాలీకి 'ఇన్‌స్టాగ్రామబుల్ ల్యాండ్‌స్కేప్' అవార్డు రావడం మరో గర్వకారణమన్నారు.

సాంస్కృతిక రంగానికి కూడా ప్రభుత్వం పునర్వైభవం తీసుకొచ్చిందని మంత్రి పేర్కొన్నారు. రెండేళ్లలో రెండు విడతలుగా కళారత్న, ఉగాది పురస్కారాలు ప్రదానం చేశామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు, గురజాడ అప్పారావు, ఘంటసాల, గుర్రం జాషువా, టంగుటూరి ప్రకాశం పంతులు తదితర మహనీయుల జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించామని చెప్పారు. కళాకారుల పెన్షన్ల పునరుద్ధరణ, కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సినిమా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్న మంత్రి కందుల దుర్గేష్, గతంలో ప్రకటించి పంపిణీ చేయని నంది అవార్డులతో పాటు 2025 సంవత్సరం నుంచి మళ్లీ నంది అవార్డులను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్-డిసెంబర్ నెలల్లో నంది నాటకోత్సవాలను తప్పనిసరిగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తెలుగు సినిమా పరిశ్రమకు అవసరమైన డబ్బింగ్ థియేటర్లు, రీరికార్డింగ్ స్టూడియోలు, ఆధునిక చిత్రీకరణ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. సింగిల్ విండో విధానంలో భూములు కేటాయించి సినీ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యాటకం, సంస్కృతి, సినిమా రంగాల సమన్వయంతో రాష్ట్రానికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చెప్పినట్లుగా "అన్ని ఈజాలు చూశాం.. ఇక మిగిలింది టూరిజమే'' అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ అజయ్ జైన్, టూరిజం ఇంచార్జ్ ఎండీ పద్మావతి, టూరిజం ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# చెంచు కుటుంబాలకు ప్రభుత్వ ఫలాలు..

### -పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

కరీంనగర్, జూన్ 19:సంచార జీవులైన చెంచు కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో చెంచుల నివాస గృహాలను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను, ధర్యాపూర్ మోడల్ స్కూల్ను పరిశీలించారు. ఈ సందర్భంగా పారుపల్లి గ్రామంలోని సంచార జీవులైన 15 చెంచు కుటుంబాల వారికి అవసరమైన ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, అర్హులైన వారికి పెన్షన్లు ఇటీవల కలెక్టర్ చెరువుతో అధికారులు అందించారు.

పారుపల్లి మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అడ్మిషన్లు అందించారు, అర్హులైన చెంచు కుటుంబాలకు కలెక్టర్ ప్రత్యేక నిధుల ద్వారా షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు.

చెంచు కుటుంబాల కోసం ఇప్పటికే నిర్మించిన 10 గృహాలను పరిశీలించిన కలెక్టర్, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి జూలై 31 నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

# ప్రజల కోసమే పుట్టిన పార్టీ టీఆర్ఎస్

-ఆదరించి.. రాష్ట్రంలో అధికారం ఇవ్వాలి..
-అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్
-తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

కరీంనగర్, జూన్ 19:ప్రజా సమస్యలే తమ ఎజెండగా ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలంగాణ రక్షణ సేన అని, రాష్ట్రంలో ప్రజలు తమను ఆశీర్వదించి అధికారం ఇవ్వాలని




టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బాయిబాట కార్యక్రమంలో భాగంగా రామగుండం నుంచి పెద్దపల్లి పర్యటనకు వచ్చిన కవితకు పార్టీ శ్రేణులు శాంతినగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడ సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పెద్దపల్లి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీతో కవితకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

అనంతరం సమీపంలో నూతనంగా నిర్మించిన టీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. కవిత మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం కోసం పని చేయడమే తమ లక్ష్యమని, ఆ దిశగా కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామని తెలిపారు. తమ పార్టీకి ప్రజలు అండగా నిలిచి ఆదరించాలని కోరారు.

అనంతరం అయ్యప్ప ఆలయ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా కన్వీనర్ నలేంద్ర కొమురయ్య, నాయకులు బాలాజీరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

# 10 వేల టన్నుల అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ప్రెస్ ఏర్పాటుకు భూమి పూజ చేయనున్న రక్షణ మంత్రి

న్యూ ఢిల్లీ, జూన్ 19: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అంబాజారిలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ యంత్ర ఇండియా లిమిటెడ్ (వైఐఎల్)లో 10,000 టన్నుల సామర్థ్యం కలిగిన అత్యాధునిక అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ప్రెస్ ఏర్పాటుకు కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ జూన్ 19, 2026న భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్, రక్షణ ఉత్పత్తి శాఖ కార్యదర్శి శ్రీ సంజీవ్ కుమార్‌లతోటు రక్షణ ఉత్పత్తి శాఖ, యంత్ర ఇండియా సంస్థకు చెందిన పలువురు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

ప్రతిపాదిత భారీ ఎక్స్‌ట్రూషన్ ప్రెస్.. భారత రక్షణ ఉత్పాదక రంగానికి అత్యంత కీలకమైన జాతీయ ఆస్తిగా మారనుంది. రక్షణ, అంతరిక్ష రంగాల అవసరాలను తీర్చడానికి అవసరమైన పెద్ద, అత్యధిక బలం కలిగిన, ఖచ్చితత్వంతో కూడిన అల్యూమినియం మిశ్రమ లోహాల ఉత్పత్తులను స్వదేశంలోనే తయారు చేసే సామర్థ్యాన్ని ఇది బలోపేతం చేస్తుంది. ప్రస్తుతం రక్షణ రంగానికి అవసరమైన కీలక అల్యూమినియం ఎక్స్‌ట్రూడెడ్ భాగాల కోసం భారత్ ఇతర దేశాల నుంచి చేసుకునే దిగుమతులపై ఆధారపడటాన్ని ఈ ప్రాజెక్టు తగ్గిస్తుంది. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఆత్మనిర్భర్ భారత్ దార్శనికత దిశగా దేశీయ ఉత్పాదక రంగానికి ఈ ప్రాజెక్టు మద్దతునందిస్తుంది.

# ఉపరితల బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకంపై మూడో రోడ్‌షోను ముంబయిలో నిర్వహించిన బొగ్గు మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జూన్ 19:ఉపరితల బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకంపై మూడో రోడ్‌షోను బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ రోజు ముంబయిలో విజయవంతంగా నిర్వహించింది. బొగ్గు గ్యాసిఫికేషన్‌ను వేగవంతం చేయడానికి, శుద్ధ ఇంధనం దిశగా దేశ పరివర్తనలో పరిశ్రమల భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడానికి మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఇది పునరుద్ఘాటించింది. ప్రముఖ పారిశ్రామిక భాగస్వాములు, ప్రభుత్వ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, పెట్టుబడిదారులు, బొగ్గు కంపెనీలు, ఈ రంగానికి చెందిన నిపుణులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశంలో పుష్కలంగా ఉన్న బొగ్గు వనరుల విలువను పెంచే ఒక విప్లవాత్మక మార్గంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌పై పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనం.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ ప్రత్యేక అతిథిగా, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీశ్ చంద్ర దూబే ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవదత్, అదనపు కార్యదర్శులు శ్రీ సనోజ్ కుమార్ ఝా, శ్రీమతి రూపేందర్ బ్రార్‌లతోపాటు ఆ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక ప్రముఖులు, సాంకేతిక నిపుణులు, పెట్టుబడిదారులు, బొగ్గు, ఇంధన రంగాలకు చెందిన ఇతర కీలక భాగస్వాములు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర బొగ్గు - గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. బొగ్గు గ్యాసిఫికేషన్ పురోగతిలో మహారాష్ట్ర అగ్రగామిగా నిలిచిందని ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూమి, విద్యుత్, సహాయక మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా రాష్ట్రం క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఒక అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించిందని ఆయన తెలిపారు. ఇప్పటికే అయిదు బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉండడం, అలాగే ఏటా దాదాపు 7 కోట్ల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసే వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (డబ్ల్యూసీఎల్) బలంగా ఉండడం... ఇలా బొగ్గు గ్యాసిఫికేషన్‌లో ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన వనరులు, పారిశ్రామిక వ్యవస్థలు మహారాష్ట్రకు ఉన్నాయన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్ పూర్తి సామర్థ్యాన్ని ఆవిష్కరించేలా.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, పరిశ్రమలు సన్నిహిత భాగస్వామ్యంతో కలిసి పనిచేస్తున్న సహకార సమాఖ్యవాదానికి మహారాష్ట్ర ఆదర్శమని ఆయన అభివర్ణించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో.. ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, ఆత్మనిర్భర భారత్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

400 బిలియన్ టన్నులకు పైగా బొగ్గు నిల్వలతో ప్రపంచంలో అయిదో అతిపెద్ద బొగ్గు నిల్వలు కలిగిన దేశంగా ఉన్న భారత్‌కు... తనకున్న ఈ అపారమైన వనరులను దేశ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చగల విలువైన ఉత్పత్తులుగా మలచుకునే అవకాశం ఉందని శ్రీ కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తి, వినియోగంలో భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద దేశమనీ, కోల్ ఇండియా లిమిటెడ్ ప్రపంచంలో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి కంపెనీ అనీ, ఛత్తీస్‌గఢ్‌లోని గేవ్రా గని ప్రపంచంలో అతిపెద్ద బొగ్గు గనుల్లో ఒకటిగా ఉందనీ ఆయన వివరించారు. దేశ విద్యుత్ అవసరాలలో 70 శాతానికి పైగా, మొత్తం ఇంధన వినియోగంలో దాదాపు 55 శాతం వాటాను బొగ్గు సమకూరుస్తోందని ఆయన తెలిపారు. దేశీయ బొగ్గు వనరులను మరింత సుస్థిరంగా, సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా.. 2070 నాటికి కర్బనోద్గార రహిత లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

బొగ్గు గ్యాసిఫికేషన్‌ను దేశ భవితకు ఒక వ్యూహాత్మక మూలాధారంగా అభివర్ణిస్తూ.. దీర్ఘకాలిక ఇంధన భద్రతను సాధించడంలోనూ, దిగుమతుల ప్రత్యామ్నాయంగానూ, పారిశ్రామిక స్వావలంబనకూ, ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను సాధించడంలోనూ ఇది కీలకమని మంత్రి వివరించారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా సింగాస్, మిథనాల్, అమ్మోనియా, అమ్మోనియం నైట్రేట్, హైడ్రోజన్, ఇథనాల్, యూరియా, సుస్థిర వైమానిక ఇంధనం, డీఆర్ఐ-గ్రేడ్ రిడ్యూసింగ్ గ్యాస్, పలు ఇతర విలువ ఆధారిత రసాయనాల ఉత్పత్తికి అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం భారీ పరిమాణంలో దిగుమతి అవుతున్న ఈ ఉత్పత్తులను.. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా దేశీయంగానే ఎక్కువగా తయారు చేయవచ్చన్నారు. ఫలితంగా విదేశీ మారక ద్రవ్యం గణనీయంగా ఆదా అవ్వడంతోపాటు దిగుమతులపై ఆధారపడడం తగ్గి ఎరువులు, ఉక్కు, రసాయనాలు, రవాణా, శుద్ధ ఇంధనం వంటి రంగాల్లో పారిశ్రామికంగా అన్ని దశల్లోనూ సరికొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆయన తెలిపారు.

జాతీయ బొగ్గు గ్యాసిఫికేషన్ మిషన్‌ను ప్రస్తావిస్తూ 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ అనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని శ్రీ కిషన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహక పథకం భారీ పెట్టుబడులకు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని, సాంకేతిక పరిజ్ఞాన స్వీకరణను వేగవంతం చేస్తుందని, బొగ్గు గ్యాసిఫికేషన్‌లో దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలబెడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతిపాదనల కోసం అభ్యర్థన (ఆర్ఎఫ్‌పీ) ముసాయిదాను భాగస్వామ్య పక్షాల సంప్రదింపుల కోసం అందుబాటులో ఉంచామనీ, అమలు యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడానికి నిర్మాణాత్మక సూచనలు, అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. చివరిగా దేశ బొగ్గు గ్యాసిఫికేషన్ కార్యక్రమాన్ని ప్రపంచ స్థాయి విజయగాథగా తీర్చిదిద్దే దిశగా... సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నీ ఈ కార్యక్రమ బాధ్యతను స్వీకరించి సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు.

ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్‌పై రోడ్‌షో ముంబయిలో నిర్వహించడం ఎంతో సముచితమైందని తన విశ్లేషణాత్మక ప్రసంగంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్‌తో ఈ నగరానికి 1862 నాటికే అనుబంధం ఉందని తెలిపారు. అప్పట్లో బొగ్గు గ్యాసిఫికేషన్‌లో ముంబయి మార్గదర్శకంగా నిలిచిందనీ, నేడు ఈ విప్లవాత్మక సాంకేతికతను అభివృద్ధి చేయడంలోనూ నగరం మరోసారి కేంద్రంగా నిలుస్తూ.. చరిత్ర పునరావృత్తమవుతోందనీ ఆయన వ్యాఖ్యానించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో, బొగ్గు మంత్రిత్వ శాఖ నిరంతర కృషితో భారత్ ఆధునిక సాంకేతికతతో కూడిన బొగ్గు గ్యాసిఫికేషన్ కొత్త శకంలోకి అడుగు పెడుతోందని ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ సాధనకు, ఆత్మనిర్భర్ భారత్ ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు.

దేశ వృద్ధికి, స్థిరత్వానికి ఇంధన భద్రత అనేది అత్యంత ప్రాథమికమైనదని చెప్పారు. ఇతర దేశాల నుంచి దిగుమతులపై అతిగా ఆధారపడటం వల్ల అంతర్జాతీయ భౌగోళిక-రాజకీయ పరిణామాలు, సరఫరా వ్యవస్థ అంతరాయాల ప్రభావం మన దేశంపై పడుతుందని తెలిపారు.

# స్వదేశీ ఎయిర్ కుషన్ వాహనం చేరిక ఐసీజీ నిర్వహణ సామర్థ్యం పెంపు

న్యూ ఢిల్లీ, జూన్ 19:భారత కోస్తా తీర రక్షకదళం (ఐసీజీ) కోసం చౌగులే అండ్ కంపెనీ తయారు చేస్తున్న ఆరు స్వదేశీ ఎయిర్ కుషన్ వాహనాల్లో (ఏసీవీ) మొదటి వాహనాన్ని ఈ రోజు గోవాలో ఐసీజీలో చేర్చుకున్నారు. అనేక సముద్రయాన విధుల్లో ఐసీజీ కార్యకలాపాల సామర్థ్యాన్ని ఈ హోవర్‌క్రాఫ్ట్ పెంచడంతో పాటు, సవాళ్లకు దీటుగా స్పందించే తత్వాన్ని బలోపేతం చేయగలగుతుంది. దీని చేరిక ఆత్మనిర్భర్ భారత్ దృష్టికోణాన్ని ప్రోత్సహించడమే కాకుండా, దేశంలో నౌకావాణిజ్య ప్రధాన పరిశ్రమల సంఖ్య ఇదివరకటితో పోలిస్తే ప్రస్తుతం పెరుగుతుండటానికి నిదర్శనంగా కూడా నిలుస్తోంది.

ఐసీజీ సీనియర్ అధికారులు, నౌకానిర్మాణ పరిశ్రమ ప్రతినిధుల సమక్షంలో ఈ ఎయిర్ కుషన్ వాహనాన్ని చేర్చుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ నౌకావాణిజ్య ప్రయోజనాలను రక్షించాల్సిన తన కర్తవ్యాన్ని నెరవేర్చడంలో ఊతంగా నిలిచే ఆధునికీకరణ, సామర్థ్యాల పెంపు అంశాలపై ఐసీజీ నిరంతరంగా తీసుకుంటున్న శ్రద్ధను ఈ ఏసీవీ చేరిక స్పష్టం చేస్తోంది. భారత కోస్తా తీర రక్షకదళం కోసం ఆరు ఏసీవీలను కొనుగోలు చేయడానికి ఉద్దేశించిన ఒప్పంద పత్రాలపై రక్షణ మంత్రిత్వ శాఖ, చౌగులే అండ్ కంపెనీ సంతకాలు చేశాయి.

# నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సెర్చ్

-సీఐ మల్లేష్

నల్గొండ, జూన్ 19:నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు, ప్రజారక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని సీఐ మల్లేష్ అన్నారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ద్వారకపేట గ్రామంలో టేకుమట్ల ఎస్ఐ అమూల్య ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో సోదాలు చేపట్టి, సరైన పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ, యువత మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత సత్ప్రవర్తన కలిగి మంచి పౌరులుగా ఎదగాలని, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ కోసం పోలీసులు అన్నివేళలా కృషి చేస్తారని పేర్కొన్నారు.

# పరీక్షా నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు, పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి: శ్రీ ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, జూన్ 19:జూన్ 21, 2026న నిర్వహించనున్న నీట్ యూజీ రీ ఎగ్జామ్‌కు (పునఃపరీక్ష) సంబంధించిన సన్నద్ధతను సమీక్షించేందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన నేడు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ), ఉన్నత విద్యా సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్, ఉన్నత విద్యా విభాగం కార్యదర్శి శ్రీ వినీత్ జోషి, ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ శ్రీ అభిషేక్ సింగ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సమావేశంలో కేంద్ర మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. పరీక్షా నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ విషయంలో సంబంధిత అధికారులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పరీక్షలో ఎలాంటి అవకతవకలు లేకుండా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు ముందస్తుగానే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని స్థాయిల్లో సమన్వయం ఉండటం ఎంతో అవసరమని చెప్పారు. ఈ రీ ఎగ్జామ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి, సమన్వయం చేయడానికి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా నియమించిన అధికారులు అన్ని రాష్ట్రాలకు చేరుకుంటారని తెలిపారు. ఈ అధికారులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ నేతృత్వంలోని ప్రధాన కమాండ్ సెంటర్‌కు నేరుగా నివేదిస్తారని మంత్రి చెప్పారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేని వాతావరణంలో పరీక్ష రాసేలా రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన నోడల్ అధికారులు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని ఆదేశించారు.

కేంద్ర పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎటువంటి ఇబ్బంది లేకుండా, పూర్తి ప్రశాంతతతో పరీక్ష రాసేలా చూడాలని కోరారు. పరీక్ష ప్రారంభానికి ముందే విద్యార్థులకు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయడం, తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ విషయంలో తగిన జాగ్రత్తలు, తక్షణ చర్యలు తీసుకోవాలని వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నోడల్ అధికారులను కోరారు.


ప్రస్తుత సమయం నుంచి రీ ఎగ్జామ్ జరిగే తేదీ వరకు ఉన్న కాలం అత్యంత కీలకమైనదని కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్రీ వినీత్ జోషి పేర్కొన్నారు. ఈ సమయంలో ముందస్తుగా, చురుకైన సమన్వయంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పరీక్షకు సంబంధించిన ఆదేశాలను, నిబంధనలను ఎప్పటికప్పుడు సకాలంలో అందరికీ చేరవేయాలని, నిర్దేశించిన అన్ని నిబంధనలన్నింటినీ కచ్చితంగా పాటించాలని ఆయన తెలిపారు.

నీట్ యూజీ రీ ఎగ్జామ్‌ను ఎలాంటి ఆటంకాలు లేకుండా, సజావుగా నిర్వహించడానికి ఎన్‌టీఏ అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తోందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ శ్రీ అభిషేక్ సింగ్ తెలిపారు. జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా స్థాయి సమన్వయ కమిటీలు, రాష్ట్ర పోలీసు విభాగాలు, నిఘా సంస్థలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ.. పరీక్షను అత్యంత సురక్షితమైన, పారదర్శకమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.

ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పరీక్షా సన్నద్ధత, వివిధ విభాగాల మధ్య సమన్వయం, కట్టుదిట్టమైన భద్రతా నియమాలు, నిర్వహణ ఏర్పాట్లు, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార వేదికలు, పరీక్షా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించడం వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పరీక్షను సజావుగా, పారదర్శకంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సంబంధిత భాగస్వాములతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు.

హైబ్రిడ్ పద్ధతిలో జరిగిన ఈ కీలక సమావేశానికి దేశవ్యాప్తంగా మొత్తం 222 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఉన్నతాధికారులు, కేంద్ర నిధుల ద్వారా నడిచే విద్యాసంస్థల నోడల్ అధికారులు, దేశంలోని ప్రముఖ ఉన్నత విద్యాసంస్థల వైస్ ఛాన్సలర్లు, డైరెక్టర్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి కేంద్ర విద్యాశాఖకు సంపూర్ణంగా సహకరిస్తామని వారంతా హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేని, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షా అనుభవాన్ని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ఖమ్మం,జూన్ 19:కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు శుక్రవారం మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమాన్ని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత మరియు రైతుల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలిగి మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోనా ధని కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిర్యాల వెంకటరమణ గుప్తా, దేవిశెట్టి రంగారావు, రంగా శ్రీనివాసరావు, ఈది అనిల్ కుమార్, కరివేద సుధాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
-అప్రోచ్ రోడ్డు నిర్మాణం తప్పనిసరి
-ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో అనుమతులు ఇవ్వొద్దు

ఖమ్మం, జూన్ 19:లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న లేఔట్ దరఖాస్తులపై రెవెన్యూ, నీటిపారుదల, ఇతర శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

ప్రతి దరఖాస్తుకు సంబంధించి వివిధ శాఖల నుంచి వచ్చిన అభిప్రాయాలు, అభ్యంతరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లేఔట్ అనుమతుల కోసం వచ్చిన 17 దరఖాస్తులను కమిటీ పరిశీలించిందన్నారు. అనుమతులు మంజూరు చేసే సమయంలో నీటి వనరుల పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్), రక్షిత పరిధి (బఫర్ జోన్)లోకి రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లేఔట్‌కు అనుసంధాన రహదారి కనీసం 18 మీటర్ల వెడల్పుతో ఉండాలని తెలిపారు.

రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని లేఔట్‌లో కేటాయించేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.

లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహ మార్గాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు జారీ చేయరాదని స్పష్టం చేశారు. అదనపు సర్వే భూ



రికార్డుల అధికారి, మండల సర్వేయర్, ఆర్డీవోలు సంయుక్తంగా దరఖాస్తు ప్రాంతంతో పాటు పరిసర సర్వే నంబర్లను పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు.

గతంలో అక్కడ ఏవైనా నీటి వనరులు ఉన్నాయా అనే అంశాన్ని సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లేఔట్ అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు అనుగుణంగానే అనుమతులు జారీ చేయాలని చెప్పారు. అలాగే అనుమతుల షరతులను అభివృద్ధి పనుల సమయంలో అమలు చేస్తున్నారో లేదో పర్యవేక్షించాలని సూచించారు.

ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ పారస్ కుమార్, ఎస్‌డీసీ సదానందం, నీటిపారుదల శాఖ ప్రధాన ఇంజనీర్ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారి, సుడా సీపీఓ రాజ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి వాకిటి శ్రీహరి సింప్లిసిటీ..

-కార్యకర్తలతో కలిసి రోడ్డు పక్క హోటల్లో టిఫిన్ చేసిన మంత్రి

మహబూబ్‌నగర్, జూన్ 19:నేటి సమాజంలో మామూలు పంచాయతీ వార్డు మెంబర్ గా గెలిచిన వ్యక్తి కూడా తన దర్పాన్ని ప్రదర్శించే ఈ రోజుల్లో రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పటికీ తన సింపిసిటీ మరోసారి చాటుకు న్నారు రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి .ఇవాళ నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు పక్కన ఉన్న ఓ చిన్న హోటల్ దగ్గర ఆగి పార్టీ కార్యకర్తలతో కలిసి మంత్రి రోడ్డు పక్కనే టిఫిన్ చేశారు. రోడ్డు పక్కన ఉన్న ఒక చిన్న హోటల్ దగ్గర మంత్రి టిఫిన్ చేస్తూ కనిపించడంతో ఆ దారి గుండా వెళ్తున్న పలువురు అక్కడ ఆగి మంత్రితో కలిసి ముచ్చటించారు.

రాష్ట్ర మంత్రి ఇంత సాధారణంగా రోడ్డు పక్కన టిఫిన్ చేస్తున్నారే అంటూ మాట్లాడుకున్నారు. మంత్రిగా ఉన్న లేకున్నా ఎప్పుడు ఒకే స్టైల్ లో సాధారణ జీవితం గడపడమే తనకి ఇష్టం అంటూ ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# తెలుగు సాహిత్యంలో జైలు–ప్రాధాన్యత

– కొల్లూరి నాగరాజు, +918688531403

సాహిత్యం సమాజానికి అద్దం. సమాజంలో చోటుచేసుకునే రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, మానవీయ పరిణామాలను ప్రతిబింబిస్తూ ప్రజల ఆలోచనలకు దిశానిర్దేశం చేయడం సాహిత్యం ప్రధాన కర్తవ్యం. సమాజం మారుతున్న కొద్దీ సాహిత్య స్వరూపం కూడా మారుతూ ఉంటుంది. సమాజంలో ఉన్న సమస్యలను వెలుగులోకి తేవడం, అన్యాయాలను ప్రశ్నించడం, మానవ విలువలను కాపాడడం వంటి బాధ్యతలను సాహిత్యం నిరంతరం నిర్వహిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో సమాజంలోని అనేక అంశాల మాదిరిగానే జైలు జీవితం, ఖైదీల అనుభవాలు, శిక్షా వ్యవస్థ, స్వేచ్ఛాహరణ, మానవ హక్కుల ఉల్లంఘనలు వంటి అంశాలు కూడా సాహిత్యంలో ప్రాధాన్య స్థానాన్ని సంపాదించుకున్నాయి.

సాహిత్యం మరియు సమాజం మధ్య విడదీయరాని సంబంధం ఉంది. సమాజంలో సంభవించే ప్రతి మార్పు సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. అదే విధంగా సాహిత్యం కూడా సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. సమాజంలోని వ్యక్తుల ఆలోచనలను, విలువలను, జీవన విధానాలను ప్రభావితం చేస్తూ సృజనాత్మక మార్పులకు దోహదపడుతుంది. అందువల్ల సామాజిక చరిత్రను అధ్యయనం చేయాలంటే సాహిత్యాన్ని కూడా పరిశీలించడం అవసరం. ఎందుకంటే అనేక సందర్భాల్లో చరిత్ర పుస్తకాలు నమోదు చేయని సామాజిక వాస్తవాలను సాహిత్యం సజీవంగా మన ముందుంచుతుంది.

తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలించినప్పుడు వివిధ యుగాల్లో సమాజంలోని అనేక అంశాలు సాహిత్య వస్తువులుగా మారినట్లు గమనించవచ్చు. ముఖ్యంగా స్వాతంత్ర్యోద్యమం, జాతీయోద్యమం, సామాజిక సంస్కరణోద్యమాల ప్రభావంతో జైలు జీవితం కూడా సాహిత్యంలో ఒక ప్రత్యేక అధ్యయన అంశంగా రూపుదిద్దుకుంది. జైలు అనేది కేవలం శిక్ష విధించే స్థలం మాత్రమే కాదు; అక్కడ వ్యక్తుల జీవితాలు, భావోద్వేగాలు, ఆశలు, నిరాశలు, పోరాటాలు, మానవ సంబంధాలు కూడా ఉంటాయి. ఈ జీవన సత్యాలను తెలుగు సాహిత్యం వివిధ ప్రక్రియల ద్వారా ఆవిష్కరించింది.

సాహిత్యం సృజనాత్మకతతో పాటు చైతన్యాన్ని కలిగించే శక్తిని కలిగి ఉంటుంది. అందువల్ల జైలు సంబంధిత అంశాలను కూడా కేవలం శిక్షా వ్యవస్థ కోణంలోనే కాకుండా మానవతా దృక్పథంతో పరిశీలించింది. ఖైదీల జీవితం, వారి మానసిక స్థితి, సమాజం వారిని చూసే తీరు, సంస్కరణ అవసరం వంటి అంశాలను రచయితలు వివిధ రూపాల్లో చిత్రించారు. ఈ విధంగా జైలు సాహిత్యం సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించింది.

తెలుగు సాహిత్యంలో జైలు అంశాలకు సంబంధించిన ప్రస్తావనలు ప్రధానంగా జాతీయోద్యమ కాలంలో ఎక్కువగా కనిపిస్తాయి. స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ జైలు శిక్షలు అనుభవించారు. ఆ అనుభవాలు వారి రచనల్లో ప్రతిబింబించాయి. ఈ నేపథ్యంలో జైలు సాహిత్యం ఒక ప్రత్యేక సాహిత్య ధోరణిగా రూపుదిద్దుకుంది. జైలు అనుభవాలు, ఖైదీల జీవితం, జైళ్లలోని పరిస్థితులు, అక్కడి మానవ సంబంధాలు రచయితల కలాలకు వస్తువులయ్యాయి.

తెలుగు నవలా సాహిత్యంలో జైలు సంబంధిత అంశాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన మాలపల్లి నవల తెలుగు జైలు సాహిత్య చరిత్రలో ప్రస్తావించదగిన రచన. రచయిత జైలు జీవితాన్ని ప్రత్యక్షంగా అనుభవించిన నేపథ్యంలో ఈ నవలలో జైలు జీవితానికి సంబంధించిన అనేక వాస్తవాలను ప్రతిబింబించారు. అనంతరం అనేక మంది నవలా రచయితలు కూడా జైలు నేపథ్యాన్ని తమ రచనల్లో ఉపయోగించారు. అల్లం రాజయ్య రచనల్లో, గూడ అంజయ్య నవలల్లో, అలాగే ఇతర రచయితల నవలల్లో కూడా జైలు జీవితానికి సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. జైలు అనుభవాలను, ఖైదీల మనోవేదనను, సమాజంలోని అసమానతలను ఈ రచనలు ప్రతిబింబించాయి.

కథా సాహిత్యంలో కూడా జైలు జీవితం ఒక ప్రధాన అంశంగా మారింది. నిఖిలేశ్వర్ కథల్లో జైలు జీవితానికి సంబంధించిన అంశాలు ప్రస్తావించబడ్డాయి. ఆయన రచనల్లో ఖైదీల జీవితం, జైళ్లలోని అనుభవాలు, నిర్బంధంలో ఉన్న వ్యక్తుల భావ ప్రపంచం చిత్రితమైంది. పొట్లపల్లి రామారావు రచించిన విముక్తి, జైలు, జైలు డైరీ వంటి కథలు జైలు అంతర్గత జీవితాన్ని విశదీకరించాయి. కంచి వెంకటరావు రచనల్లో కూడా జైలు జీవితం కథా వస్తువుగా కనిపిస్తుంది. ఈ కథలు ఖైదీల మానవీయ కోణాన్ని పాఠకుల ముందుంచాయి.

తెలుగు కవిత్వంలో కూడా జైలు అనుభవాలు ప్రముఖ స్థానాన్ని సంపాదించాయి. ముఖ్యంగా స్వాతంత్ర్యోద్యమ కాలంలో జైలు శిక్షలు అనుభవించిన కవులు తమ అనుభవాలను కవిత్వ రూపంలో వ్యక్తీకరించారు. దాశరథి కృష్ణమాచార్యులు జైలు గోడలపై బొగ్గుతో కవితలు రాసిన సంఘటన తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయం. ఆయన కవిత్వంలో స్వేచ్ఛాప్రేమ, నిర్బంధ వ్యతిరేకత, మానవ విముక్తి భావనలు ప్రతిధ్వనిస్తాయి. జైలు అనుభవాలు కేవలం వ్యక్తిగత బాధగా కాకుండా సామాజిక పోరాట చిహ్నాలుగా ఆయన కవిత్వంలో వ్యక్తమయ్యాయి.

నాటక సాహిత్యంలో కూడా జైలు సంబంధిత అంశాలు ప్రాధాన్యం పొందాయి. దాశరథి కృష్ణమాచార్యులు రచించిన స్వాతంత్ర్య వాహిని వంటి నాటకాలు స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో జైలు జీవితాన్ని ప్రతిబింబించాయి. అలాగే ఇతర నాటక రచయితలు కూడా జైలు జీవితం, దేశభక్తి, స్వేచ్ఛా పోరాటం, నిర్బంధ రాజకీయాలను తమ రచనల్లో చిత్రించారు. ఈ నాటకాలు ప్రేక్షకుల్లో జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించాయి.

జైలు సంబంధిత అంశాలు కేవలం సాహిత్య రచనలకే పరిమితం కాలేదు. పరిశోధనా రంగంలో కూడా ఈ అంశంపై అధ్యయనాలు జరిగాయి. వేదగిరి రాంబాబు 1991లో జైలు సంబంధిత అంశాలపై గ్రంథరూపంలో పరిశోధన అందించారు. జైలు జీవితాన్ని ఆధారంగా చేసుకొని రూపకాలు, రేడియో కార్యక్రమాలు కూడా ప్రసారమయ్యాయి. విజయవాడ ఆకాశవాణి ద్వారా జైలు ఖైదీల జీవితాలపై రూపొందించిన కార్యక్రమాలు ప్రసారమయ్యాయి. దీనివల్ల జైలు జీవితం పట్ల సమాజంలో అవగాహన పెరిగింది.

సినిమా రంగం కూడా జైలు సాహిత్య ప్రభావాన్ని స్వీకరించింది. జైలు నేపథ్యాన్ని ఆధారంగా చేసుకొని అనేక చిత్రాలు నిర్మించబడ్డాయి. ఖైదీల జీవితం, శిక్షా వ్యవస్థ, మానవీయ విలువలు, సంస్కరణ అవసరం వంటి అంశాలను చిత్రాలు ప్రజల్లోకి తీసుకెళ్లాయి. జైలు అనుభవాలను కేంద్రంగా చేసుకొని రూపొందిన చిత్రాలు ప్రజాదరణ పొందడమే కాకుండా సామాజిక చర్చలకు దారితీశాయి.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో జైలు సంబంధిత సాహిత్యం ఒక విశిష్ట అధ్యయన రంగంగా అభివృద్ధి చెందింది. నవల, కథ, కవిత్వం, నాటకం, పరిశోధన, ప్రసార మాధ్యమాలు, సినిమా వంటి అనేక ప్రక్రియల్లో జైలు జీవితం ప్రతిబింబించబడింది. జైలు అనుభవాల ద్వారా మానవ జీవితంలోని సంక్లిష్టతలను, స్వేచ్ఛ విలువను, సామాజిక న్యాయ అవసరాన్ని రచయితలు ఆవిష్కరించారు. ఖైదీలను కేవలం నేరస్తులుగా కాకుండా మానవులుగా చూడాలనే దృక్పథాన్ని ఈ సాహిత్యం సమాజానికి అందించింది. అందువల్ల తెలుగు సాహిత్యంలో జైలు సంబంధిత రచనలు కేవలం సాహిత్య విలువలకే కాకుండా సామాజిక చైతన్యానికి, మానవతా దృక్పథ వికాసానికి కూడా విశేషంగా దోహదపడ్డాయని చెప్పవచ్చు.

## ఘనంగా శ్రీ మెట్లబావి ధన మైసమ్మ తృతీయ వార్షికోత్సవాలు

### 20, 21 తేదీల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, శోభాయాత్ర

వరంగల్, జూన్ 19: 34వ డివిజన్ శివనగర్‌లోని శ్రీ మెట్లబావి ధన మైసమ్మ అమ్మవారి తృతీయ వార్షికోత్సవాలను ఈ నెల 20, 21 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తోట బాబన్న తెలిపారు.

ఈ సందర్భంగా జూన్ 20 శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాతం, ఉదయం 6 గంటలకు యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, గణపతి పూజ, అంకురార్పణ, క్షేత్రపాలక ఆరాధన, సర్వతోభద్ర మండలి పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 9 గంటలకు సహస్ర కలశాలతో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, దర్శన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

జూన్ 21 ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు చండీ హోమం, ఉదయం 9 గంటలకు సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ, మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తారు.

అదే రోజు సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మవారి శోభాయాత్ర వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ ధన మైసమ్మ అమ్మవారి కటాక్షానికి పాత్రులు కావాలని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తోట బాబన్నతో పాటు కమిటీ కార్యవర్గ సభ్యులు కోరారు.

## చిట్యాలలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

వరంగల్, జూన్ 19:దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమని మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్ అన్నారు. శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలోని కనకదుర్గ గుడి సెంటర్‌లో పురపాలక చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించారని తెలిపారు. ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవి చేపట్టకుండా మన్మోహన్ సింగ్‌ను ప్రధాని చేశారని పేర్కొన్నారు.

ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ దేశ ఐక్యత కోసం పనిచేస్తున్నారని తెలిపారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## లారీ ఢీకొని వ్యక్తి మృతి..

మెదక్, జూన్ 19:మాసాయిపేట మండలం రామంతాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, చిన్న శంకరంపేట మండలం చందంపేట గ్రామానికి చెందిన షేక్ ఎల్లం (35), రామంతాపూర్ గ్రామానికి చెందిన రెడ్డబోయిన ఆంజనేయులుతో కలిసి బైక్‌పై చేగుంట నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఓ లారీ రామంతాపూర్ చౌరస్తా వద్ద వారి బైక్‌ను ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో షేక్ ఎల్లం కడుపుపై నుంచి లారీ వెళ్లడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఇద్దరినీ అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే షేక్ ఎల్లం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గాయపడిన ఆంజనేయులు చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.

## జహీరాబాద్‌కు త్రివేణివనం

### –208 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఫారెస్ట్ ఎకో పార్కు ప్రజలకు అంకితం
### –వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
### –పచ్చదనం పెంపే ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ సురేష్ షెట్కార్



సంగారెడ్డి, జూన్ 19:జహీరాబాద్ పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో 208 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన త్రివేణివనం-ఫారెస్ట్ ఎకో పార్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వనమహోత్సవం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా హరిత వాతావరణాన్ని నెలకొల్పే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 11 ఎకో పార్కులను ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించడం హర్షణీయమన్నారు.

జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్ ద్వారా పారిశ్రామిక స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకుంటోందని, భారీ పరిశ్రమల రాకతో యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన త్రివేణివనం ఎకో పార్కులో హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహా సౌకర్యాలను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు.

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించ వచ్చన్నారు. ప్రాణవాయువును అందించే చెట్లు, అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ త్రివేణివనం?ఫారెస్ట్ ఎకో పార్కును ఆకర్షణీయంగా అభివృద్ధి చేశామని తెలిపారు. పార్కులో సైక్లింగ్‌తో పాటు పలు ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వనమహోత్సవం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని మరింత విస్తరించాలని కోరారు.

అనంతరం అతిథులు అటవీ శాఖ రూపొందించిన వనమహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సఫారీ వాహనంలో ఎకో పార్కును సందర్శించి వివిధ సౌకర్యాలను పరిశీలించడంతో పాటు మొక్కలు నాటారు. అనంతరం జెండా ఊపి సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ చైర్మన్ యూనిస్, ఉజ్వల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, తహసీల్దార్, అటవీ శాఖ, పోలీసు శాఖ అధికారులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య ఉజ్వల భవిష్యత్తుకు పునాది



నిజామాబాద్, జూన్ 19:ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది అని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని గ్రామ సర్పంచ్ మేసా కార్తీక్ అన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండల కేంద్రం బెజ్జోరా గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ మేసా కార్తీక్, పాఠశాల ఉపాధ్యాయురాలు, గ్రామ ఉపసర్పంచ్‌తో కలిసి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్యతో పాటు ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూడేళ్ల లింబయ్య, ఉపాధ్యాయ బృందం, పాలకవర్గ సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## తోట్ల ఎల్లమ్మ దేవతకు పూజలు నిర్వహించిన భక్తులు

హైదరాబాద్, జూన్ 19: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నేపల్లి తోట్ల ఎల్లమ్మ ఆలయంలో భక్తులు శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ తల్లికి పూజలు నిర్వహించడంతోపాటు కోడి బియ్యం ప్రసాదం సమర్పించారు. గత సంవత్సరంలో ఆలయ ధర్మకర్త జిగేల్ రత్నారెడ్డి నియోజకవర్గంలో ఆలయపున నిర్మాణం జరగగా అప్పటినుండి తోట్ల ఎల్లమ్మ దేవాలయానికి భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుంది. ప్రతి ఆదివారం మంగళవారం శుక్రవారం రోజుల్లో భక్తులు పెద్ద ఎత్తున వస్తున్నారు. తోట్ల ఎల్లమ్మ దేవాలయం కి వచ్చే ప్రధాన మార్గంలో మాజీ కౌన్సిలర్ అనంతరెడ్డి ప్రధాన ద్వారాన్ని నిర్మిస్తున్నారు.

## నిధులు మంజూరు చేయాలి..

### –ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకుల వినతి

హైదరాబాద్, జూన్ 19: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్ డివిజన్ గిర్మాపూర్ పట్టణంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించారు.

గిర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ప్రస్తుత అంగన్‌వాడీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని నాయకులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వర్షాకాలంలో పైకప్పు నుంచి వర్షపు నీరు భవనంలోకి చేరుతుండటంతో చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

భవనం పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొందని పేర్కొన్నారు. చిన్నారుల భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎంపీ నిధుల నుంచి ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేసి నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ బీజేపీ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు ముదిరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు వంగేటి హనుమంత్ రెడ్డి, చీర్ల సత్యనారాయణ, డివిజన్ బీజేపీ కార్యదర్శులు బండి విష్ణు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సినీ గీత రచనకు ఆద్యులు చందాల కేశవదాసు

తెలుగు సినిమాలలో తొలి పాటను రాసింది ఎవరో తెలుసా? అలాంటి అవసరం, అవకాశం, సందర్భం రాలేదనుకుంటా. 1931లో తీసిన తొట్టతొలి తెలుగు టాకీ చిత్రం భక్త ప్రహ్లాదలో పరితాప భారంబు భరియింప తరమా అనే పాటను రాసింది బహుముఖ ప్రజ్ఞాశాలి చందాల కేశవదాసు. అంతేకాదు ఆయన బహుముఖ ప్రజ్ఞ గురించి తెలుసుకొనే ప్రయత్నం చేయకుంటే, ఆ మహనీయునికి తీరని అన్యాయం చేసిన వారం అవుతాం.

చందాల కేశవదాసు (జూన్ 20, 1876 – మే 14, 1956) తొలి తెలుగు నాటక కర్త, తొలి సినీ గీత రచయిత, కవి, నటులు, గాయకులు, హరికథా కళాకారులు, అష్టావధాని, శతావధాని. నాటకాల్లో మొదట పాడే పరబ్రహ్మ పరమేశ్వర అనే గొప్ప కీర్తనను, తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే భలే మంచి చౌక బేరము అనే పాటను రాసింది కూడా ఆయనే.

కేశవదాసు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని జక్కేపల్లి లో 1876 జూన్ 20వ తేదీన చందాల లక్ష్మీనారాయణ, పాపమ్మ దంపతులకు రెండవ కుమారుడిగా జన్మించారు.

తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో వీధిబడిలోనే కేశవదాసు విద్యనభ్యసించారు. ఛందస్సు, అవధానాధి ప్రక్రియలు నేర్చుకున్నారు. విద్యాభ్యాస అనంతరం తను చదువుకున్న వీధి బడి నడుపుతూ అవధానాది ప్రక్రియలలో నేర్పు సాధించారు.

అష్టావధానాలు చేస్తూ దేశాటన చేస్తున్న కాలంలో సుప్రసిద్ధ వాగ్గేయకారుడు పాపట్ల కాంతయ్యతో స్నేహం ఏర్పడి, కాంతయ్య ద్వారా సంగీతంలోని మెలకువలు నేర్చుకున్నారు. గేయరచనలో, సంగీతం కూర్పులో, హరికథనంలో, రచనలో కేశవదాను ఆరితేరారు.

కాంతయ్యనాటక సమాజంలోచేరి కవిగా, నటుడిగా పేరుగాంచారు. ఈయన సేవకుడు వేషం నుంచి రాజు వేషం వరకు ఏ వేషమైనా వేసి మెప్పించగల సమర్థులు. మైలవరం కంపెనీకి శ్రీకృష్ణ తులాభారం, రాధా కృష్ణ నాటకాలకు పాటలు రాసిచ్చారు.

అలా శ్రీకృష్ణ తులాభారం కోసం 'భలే మంచి చౌక బేరము సమయము మించినన్ దొరుకదు', నాటకాల్లో మొదట పాడే 'పరబ్రహ్మ పరమేశ్వర' అనే సుప్రసిద్ధ కీర్తన కేశవదాసు రాశారు. భక్త ప్రహ్లాద, కనకతార వంటి చిత్రాలకు కేశవదాసు మాటలు, పాటలు వ్రాశారు.

1930–33ల మధ్య కేశవదాసు వ్రాసిన జాతీయ గీతాలను సినీ గాయకుడు సాలూరు రాజేశ్వర రావు, అముల నరసింహా రావులు పాడగా బెంగుళూరులో రికార్డు చేశారు. ఈయన అనేక సినిమా స్క్రిప్టులతో పాటుగా, కేశవ శతకం, బలి బంధనం, సీతా కళ్యాణం, రుక్మాంగద, మేలు కొలుపులు, జోలపాటలు మొదలైన రచనలు చేశారు. బాల భారత్ సమాజం వారు ఆయన ఆధ్వర్యంలో అనేక నాటకాలను ప్రదర్శించేవారు. "కనక తార", "లంకా దహనం" వంటి నాటకాలను సినిమాలుగా కూడా తీసారు.

నాటక రంగంలో చందాల కేశవదాసు మంచి పేరుతో ఒక వెలుగు వెలిగిపోతున్న సమయంలో సినిమా రంగం ఆహ్వానం పలికింది. అప్పటి దాకా భారతదేశ మంతటా మూగ సినిమాలు ఆడేవి. 1931 మార్చి 15న దేశంలో తొలిసారిగా 'ఆలం ఆరా' అనే మాటలతో కూడిన సినిమా వచ్చింది. ఇదే తొలి భారతీయ టాకీ. అదే యేడాది తెలుగులో కూడా టాకీ చిత్రం తీయాలనుకుని భక్త ప్రహ్లాద చిత్రం (1931–32)న ప్రారంభించారు. ఆ చిత్రంలో పాటలు రాయడానికి మన చందాల కేశవదాసును పిలవడంతో ఆయన సినీ జీవితం మొదలైంది.


ఈచిత్రంలో ప్రహ్లాదునిగా కృష్ణాజిరావు షిండే, హిరణ్య కశ్యపునిగా మునిపల్లె సుబ్బయ్య, లీలావతిగా సురభి కమలాబాయి నటించారు. చిత్రంలో ఈమె పాడిన పరితాప భారంబు భరియింప తరమా పాటనే చందాల కేశవదాసు సినిమాకు రాసిన తొలిపాట.

పరితాప భారంబు భరియింప తరమా...కటకట నే విధి గడువంగ జాలుదు పతి ఆజ్ఞను దాట గలనా

**పుత్రుని కాపాడ గలనా .....పరి...**
**ఈ విషము నేనెటులను**
**తనయుని ద్రావింపగలను?**
**ధర్మమును కాపాడుదునా?**
**తనయుని కావగగలనా? .... పరి...**

అలాగే... తనయా ఇటులన్ తగుపలుకు, మునిపల్లె సుబ్బయ్య పాడిన భీకరమగు నా ప్రతాపంబునకు భీతిలేక ఇటు చేసెదవా రెండు పాటలు కూడా చందాల రాశారు.

అలా చందాల కేశవదాసు తొలి తెలుగు సినీ కవిగా చరిత్ర కెక్కారు. తొలి చిత్రం భక్త ప్రహ్లాద (1931–32)కు రాసిన పాటలు, 1942లో తీసిన భక్త ప్రహ్లాదలోనూ వాడుకున్నారు. శ్రీకృష్ణ తులాభారం (1935)లో రాసిన పాటలు ఆ తరువాత 1956, 1966లోనూ అందుకే ఆయన తెలుగు సినిమా వాచస్పతిగా చరిత్రకెక్కారు.



**చందాల కేశవదాసు (జూన్ 20, 1876 – మే 14, 1956) తొలి తెలుగు నాటక కర్త, తొలి సినీ గీత రచయిత, కవి, నటులు, గాయకులు, హరికథా కళాకారులు, అష్టావధాని, శతావధాని. నాటకాల్లో మొదట పాడే పరబ్రహ్మ పరమేశ్వర అనే గొప్ప కీర్తనను, తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే భలే మంచి చౌక బేరము అనే పాటను రాసింది కూడా ఆయనే.**

'భక్త ప్రహ్లాద' (1931–32) తరువాత కేశవదాసు గారు రచయితగా పని చేసిన సినిమా 'సతీ సక్కు బాయి' (1935). భారత లక్ష్మీ ఫిలింస్ వారి ఈ చిత్రంలో 'కృష్ణా పోబోకురా', 'రాదేల కరుణా', 'ఆటలాడు కోరా', 'పాలువిూగడ పలుమార్లు భుజియించి', 'పాషాణ మెటులైతివో', 'జాగేలా కావగ రారుగా' పాటలు రాశారాయన.

శ్రీ కృష్ణతులాభారం' ముత్తరాజు సుబ్బారావు రాసిన రంగస్థల నాటకం తొలిసారిగా చిత్ర రూపం దాల్చి 1935లో విడుదలైంది. జయసింగ్ కృష్ణుడు, ఋష్యేంద్ర మణి సత్యభామ, కపిలవాయి రామనాథశాస్త్రి నారదుడు. ఋష్యేంద్ర మణి, కాంచనమాల, రేలంగి, లక్ష్మీరాజ్యం వంటి నటులకు ఇదే తొలిచిత్రం! 1955లో రాజరాజేశ్వరీ వారు ఇదే చిత్రం తీశారు. సి.ఎస్.రావు దర్శకుడు కాగా, రఘురామయ్య కృష్ణుడు, సూరిబాబు నారదుడు, ఎస్.వరలక్ష్మి సత్యభామ. ఇక 1966లో డి.రామానాయుడు సురేష్ పతాకం కింద మళ్లీ 'శ్రీ కృష్ణ తులాభారం' తీశారు. రామారావు కృష్ణుడు, కాంతారావు నారదుడు, జమున సత్యభామ, కమలాకర రామేశ్వరరావు దర్శకుడు. 1935 లో సి.పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన కాశీ ఫిలింస్ వారి శ్రీకృష్ణ తులాభారం'లో ఆయన రాసిన మూడు పాటలు... భలే మంచి చౌకబేరము, మునివరా తుదికిట్లు నానున్ మోసగింతువా, కొట్టు కొట్టండి బుర్ర పగలు గొట్టండి. ఈ మూడు పాటలను ఆ తరువాత మరో రెండుసార్లు శ్రీకృష్ణ తులాభారం చిత్రాన్ని 1955, 1966ల్లో నిర్మించినపుడు కూడా వాడుకున్నారు.

1935లో అరోరా ఫిలిమ్స్ ఆరోరా ఫిలిమ్స్ వారు 'అనసూయ' చిత్రాన్ని కోల్‌కత్తాలో తీశారు. ఈ సినిమాకి మాటలు, పాటలు, పద్యాలూ అన్నీ కేశవదాసే రాశారు. 1935లో సతీ అనసూయ, ధ్రువవిజయం, సినిమాలకు రచయితగా పని చేశారు.

చందాల కేశవదాసు1936లో వచ్చిన 'లంకాదహనం' సినిమాకు కూడా మాటలు, పాటలు, పద్యాలూ రాశారు. కనకతారకు రాసిన కథ, పాటలు 1937, 1956లోనూ యథాతథంగా ఈ సినిమాల్లో వినియోగించు కున్నారు. మైలవరం కంపెనీ వారి బాలభారతి సమాజం పక్షాన నాటక ప్రదర్శనకోసం పలు ప్రాంతాలు తిరిగారు.

హరికథలు చెప్పడంలో కేశవదాసుది అందెవేసిన చేయి. అష్టావధానిగా, హరిదాసుగా నాటి తెలుగు సమాజంలో కేశవదాసుది ఒక ప్రత్యేక స్థానముండేది.

స్వాతంత్ర్య సమర సమయంలో గాంధీజీ విధానాలకు ముగ్ధుడై గాంధీని తన రచనలతో ప్రశంసించకుండా వుండలేక పోయారు. "జయతు జై" అంటూ పాట రాయడమే కాక దానిని ఆకుల నరసింహారావు, సాగి రాజేశ్వర రావులతో పాడించి బెంగుళూరులో స్వంత ఖర్చులతో రికార్డు చేయించి ఉద్యమానికి దోహదకారి అయ్యేలా దానిని విడుదల చేసారు.

తన కళా ప్రదర్శనల ద్వారా పొందిన బంగారు కంకణాలను, పతకాలను దాచుకోకుండా సత్కార్యాలకోసం ఖర్చుచేసి మార్గదర్శకంగా నిలిచాడు. హరికథా గానంతో వచ్చిన డబ్బుతో భద్రాచలంలో భక్తుల సౌకర్యార్థం బావి త్రవ్వించి, భోజన, విశ్రాంతి ఏర్పాట్లు చేశారు. తన ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న కలపను సీతారామ చంద్రస్వామి రథగోపుర నిర్మాణానికి వాడారు. తమ్మరలో గాలిగోపురం, ధ్వజస్తంభం పనులు డబ్బులేక ఆగిపోతే ఇంటికి మనిషిని పంపించి బార్యచేతి బంగారు గాజులు తెప్పించి అమ్మారు. నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ దగ్గర్లో వున్న సీతారామ చంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు. ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ కావించారు. భద్రాచలం తిరువూరు మార్గం నుండి వేళ్లే భక్తులకు తిరువూరులో సత్రాలు ఏర్పాటు చేశారు. స్వంత ఖర్చుతో వీటిల్లో భక్తులకు ఉచిత అన్న దానం చేశారు. కోదాడ మండలం తమ్మరలో సీతారామచంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు.

రజాకార్లు జక్కేపల్లిలో కేశవదాసు ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఆ దాడిలో ఆయన ఆస్తిపాస్తులు, ధనమే గాక అంతకన్న విలువైన ఆయన సాహిత్య సంపద కూడా నాశనమైనది. కేశవదాసు 1956 మే 14న అంటే దుర్ముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం లో మరణించారు.



–రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

## ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి
### -మర్రి మహేష్



హనుమకొండ, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ గర్ల్స్- హై స్కూల్, ప్రాక్టీస్ హై స్కూల్లో సర్వే నిర్వహించారు. ఈ స్కూళ్లలో కొన్ని స్కూళ్లలో చదువు చెప్పడానికి టీచర్స్ కోరుతూ ఉందని మర్కజీ హైస్కూల్లో హిందీ బోధించడానికి టీచర్స్ కొరత ఉందని గేమ్స్ ఆడిపిం చడానికి స్కూల్ మొత్తంలో ఒక్కరే పీఈటీ ఉన్నారని మరొకరి అవసరం ఉందని అలాగే టాయిలెట్ సరిపోను లేవని ప్రాక్టీసింగ్ హైస్కూల్లో పర్మినెంట్ టీచర్స్ లేరని డిప్యూటేషన్ మీద వచ్చిన వారే ఉన్నారన్నారు. బాయ్స్‌కి మొత్తానికి టాయిలెట్స్ లేవని ఉన్న స్కూళ్లలో క్లీన్ చేయడానికి స్కావెంజర్స్ లేరని గర్ల్స్ హైస్కూల్లో వాన పడినప్పుడు గ్రౌండ్‌లో నీళ్ళు ఆగుతు న్నాయని క్లాస్రూంలోకి నడవడానికి కూడా ఇబ్బంది అవుతుందని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ స్కూల్ సమీపంలోనే ప్రైవేట్ పాఠశాలలు నెలకొన్నాయని వెంటనే డీఈఓ, కలెక్టర్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ కార్యవర్గ సభ్యులు వంగవీటి మోహన్, జిల్లా నాయకులు రమణ, విశ్వతేజ్ పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



కరీంనగర్, జూన్ 19:(నేటినిజం ప్రతినిధి) కాంగ్రెస్ యువ నాయకులు రాహుల్ గాంధీ కాబోయే భారత ప్రధాని అని అన్నారు మాజీ కార్పొరేటర్ హర్ష మల్లేశం. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావు చౌరస్తా వద్ద రాహుల్ గాంధీ జన్మదిన పురస్కరించుకొని.. మాజీ కార్పొరేటర్ అర్ష మల్లేశం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలి అంటే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ అర్ష మల్లేశం మాట్లాడుతూ... గాంధీ కుటుంబాలు త్యాగాలకు మారుపేరని.. వారి వారసత్వాన్ని పునికి పుచ్చుకొని.. భారతదేశ రాజకీయాలలో .. కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళుతున్న యువ నాయకులు రాహుల్ గాంధీ అని కొనియాడారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి.. దేశ ప్రధానిగా వారు సేవలందించడం ఖాయం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో.. మాజీ జెడ్పిటిసి కాశెట్టి శ్రీనివాస్, మిాసాల శంకర్, మూల క్రిష్ణ రెడ్డి, అనంతుల రమేశ్, దుగ్గు మహేందర్,అహ్మద్ హుస్సేన్, గండి గణేష్, వజీర్ ఫారుఖ్, మహమ్మద్ సమి, అహ్మద్, మిాసాల గంగ రామ్, తదితరులు పాల్గొన్నారు.




## అంధకారంగా రామవరం బ్రిడ్జి -విద్యానగర్ బైపాస్ రోడ్డు

ఖమ్మం, జూన్ 19:రామవరం బ్రిడ్జి నుంచి విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్డు వెంట వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు, వాకర్స్ అధికారులను, ఎమ్మెల్యేను కోరుతున్నారు. రామాలయం నుండి విద్యానగర్ కాలనీ, చుంచుపల్లి తండా, హౌసింగ్ బోర్డ్ ప్రాంతాల మీదుగా ఖమ్మం వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఈ బైపాస్ రోడ్డు అనుసంధానంగా ఉండడంతో నిత్యం వందలాది మంది వాహనదారులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిపై పోలీస్ స్టేషన్ కూడా ఉన్నప్పటికీ ఇప్పటివరకు వీధిలైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో తెల్లవారుజామున, సాయంత్రం, రాత్రి వేళల్లో ఈ ప్రాంతం అంధకారంగా మారి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వెళ్లే ప్రజలు కూడా భద్రతా సమస్యలను ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. రహదారిపై సరైన వెలుతురు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బైపాస్ రహదారి అభివృద్ధికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక కృషి చేశారని, ఇప్పుడు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీధిలైట్ల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది, వాహనదారులు, వాకర్స్ అందరికీ ఉపయోగపడేలా ఈ మార్గంలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే భద్రత పెరగడంతో పాటు ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

## యువతకు ప్రధాని మోదీ 24 కోట్ల ఉద్యోగాలు బాకీ: జగ్గారెడ్డి

సంగారెడ్డి, జూన్19: సంగారెడ్డి జిల్లాకు బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఇక్రిశాట్, ఐఐటీ హైదరాబాద్ తదితర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి తెలిపారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ ప్రైవేటీకరణ చేస్తుందని ఆయన మండిపడ్డారు. శుక్రవారం సంగారెడ్డిలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో జగ్గారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నెహ్రూ పాలనని బ్రేక్ చేశామని బీజేపీ నేతలు సంబరాలు చేస్తున్నారని వ్యంగ్యంగా అన్నారు.

రాహుల్ గాంధీ తల్లి, తండ్రి, తాత, నానమ్మ, ముత్తాత దేశం కోసం ఏం చేశారో తాను వివరిస్తానని తెలిపారు. మరి12 ఏళ్ల ప్రధాని మోదీ పాలనలో ఏం చేశారో సమాధానం చెబుతారా? అంటూ బీజేపీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల పేరుతో ప్రధాని మోదీ యువతకి 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా చిన్నారులు 350 మందికి సైకిళ్లు పంపిణీ చేశామని చెప్పారు. రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## త్యాగాల కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం
### -వేములవాడలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..
### -హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జూన్ 19: (నేటినిజం ప్రతినిధి): దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస అన్నారు. వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూము మధు ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించారని ప్రభుత్వ విప్ అన్నారు. దేశం కోసం రాహుల్ గాంధీ కుటుంబం ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దేశ ఐక్యత కోసం రాహుల్ గాంధీ పనిచేస్తున్నారని 2029 లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆది శ్రీనివాస్ కోరారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ తు మ్ మధు మధు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను లెక్క చేయని కుటుంబం రాహుల్ గాంధీ గారిదేనని అన్నారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడం కోసం అహర్నిశలు తమ వంతుగా పనిచేస్తామని తెలిపారు. రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి దేశానికి మరెన్నో సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఎల్లప్పుడూ రాహుల్ గాంధీ కి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని స్వామి వారిని వేడుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు ఇప్పపుల అజయ్, కొండ శేఖర్, కొక్కుల బాలకృష్ణ, టైలర్ శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, తోట రాజు, కొ ఆప్షన్స్ సభ్యులు పీర్ మహమ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ సాబీర్, కాంగ్రెస్ నాయకులు నాగుల విష్ణు, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, చిలుక రమేష్, సంఘ సామి, తోటలహరి, దండుగుల తిరుపతి, సయ్యద్ సాబీర్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు,పాల్గొన్నారు

## పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంలో పాల్గొన్న ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, జూన్ 19: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ బోనాలు నిర్వహించారు. ఈ మహోత్సవం వేడుకల్లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి,అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాసాల లావణ్య శ్రీనివాస్, పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బైరి సతీష్,మాజీ కౌన్సిలర్లు మారం కుమార్,కందుల క్రాంతి, మాజీ ఎంపీటీసీ ఐలవేని రాజేందర్ , మల్లికార్జున్ ,గొట్టం శంకర్,శ్రీనివాస్,మధు,పిల్లి సిద్దార్థ, కూన బాబు, చెన్నవేని శ్రీనివాస్, గొట్టం దేవయ్య,దేవేందర్, రేగుల శ్రీధర్, మామిండ్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.